
ప్రతిపక్షం
www.prathipaksham.in



సోమవారం 12.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 293 పేజీలు:8 | ₹5
@prathipaksham | prathipaksham tv telugu

ఉత్కంఠ పోరులో భారత్ జయకేతనం 8



ఇరాన్‌లో ఆందోళన ఉధృతం

- తారస్థాయికి చేరిన అల్లర్లు
- 203 మది మృతి
- అందులో 162 మంది నిరసనకారులు, 41 మంది భద్రతా సిబ్బంది
- సమస్య పరిష్కరించేందుకు మేం సిద్ధం: అధ్యక్షుడు పెజెష్కియాన్
- నిరసనకారులకు అమెరికా మద్దతు
- నిశితంగా పరిశీలిస్తున్న భారత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 11: ఇరాన్‌లో గత కొద్దిరోజులగా ఇరాన్‌లో జరుగుతున్న నిరసనలు తారాస్థాయికి చేరాయి. ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ దారుణంగా పడిపోవడం, జీవన వ్యయాలు పెరగడం వంటి సమస్యలతో డిసెంబర్ 28 నుంచి ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టారు. 203 మందికి పైగా మృతిచెందారు. మృతుల్లో 162 మంది నిరసనకారులు ఉండగా, 41 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ అంతటా నిరసనలు విస్తరిస్తున్న నేపథ్యంలో అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిరసనకారుల వాదనలు వినేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే కొంతమంది అల్లరి మూకలు మొత్తం సమాజాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు స్పందించారు. ప్రజల్లో ఆందోళన నెలకొన్న విషయం వాస్తవమేనన్నారు. అయితే తాము నిరసనకారులతో మాట్లాడాలని, వారి సమస్యలను పరిష్కరించడం తమ కర్తవ్యమని పేర్కొన్నారు. కానీ, అంతకంటే ముఖ్యమైన పని మరొకటుందని, అదేంటంటే కొంతమంది అల్లరి మూకలు మొత్తం సమాజాన్ని నాశనం చేయకుండా చూస్తున్నారని మీడియాతో చెప్పారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను ఇరాన్ ప్రభుత్వం ఇదివరకే నిలిపివేసింది. దీంతో అక్కడ ఏం జరుగుతుందనే విషయం బాహ్య ప్రపంచానికి తెలియడం కష్టతరమైంది. మరోవైపు, నిరసనకారులు ఆందోళనల్లో పాల్గొంటే దేవుని శత్రువుగా భావిస్తామని,

...:: మిగతా 2లో



క్యూబాకు ట్రంప్ హెచ్చరిక

క్యూబా లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై ఆ దేశానికి ఎలాంటి చమురు గానీ, డబ్బు గానీ వెళ్లవని.. పరిస్థితి చేయి దాటిపోకముందే ఒక ఒప్పందానికి రావాలన్నారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు.

7



డీఎంకే - కాంగ్రెస్ పొత్తు లేనట్లేనా..?

ఈ ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ కొత్త పొత్తులు కలిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటిదాకా కలిసున్న పార్టీలు దూరమయ్యే అవకాశాలున్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి.

7

తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక ‘మేడారం’ జాతర

ప్రపంచానికి జాతరను పరిచయం చేస్తాం..



- భక్తులకు వసతికల్పనకు రూ. 251 కోట్లు
- 15 కల్లా జాతర పనులు పూర్తి చేస్తాం
- మేడారం లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు

జనవరి 11: సమ్మక్క సారలమ్మ జాతర కేవలం గిరిజనుల పండుగ మాత్రమే కాదు ఈ వేడుక తెలంగాణ గుండె చప్పుడు ఆత్మ గౌరవ ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మేడారంలో జాతర పనులను మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి జాతర ఏర్పాట్ల పై సమీక్షించి తదుపరి మీడియా తో మాట్లాడారు. ఆతరువాత అమ్మవారులను దర్శించుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతర విశిష్టతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా శాశ్వత నిర్మాణాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు జరుగుతున్నాయని తెలిపారు. ఈ జాతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం 251 కోట్లు ఖర్చు చేస్తుందని ఇందులో జాతర నిర్వహణ కోసం 150 కోట్లు శాశ్వతంగా గుడి నిర్మాణ పనులకు గాను 101 కోట్లు విచ్చిస్తున్నట్టు వివరించారు. నిధుల ఖర్చు చేయాల్సిన పనులు అన్ని విషయాలను మేడారంలో సమీక్షించి ఇక్కడికి ఇక్కడే నిర్ణయాలు చేసినట్టు డిప్యూటీ సీఎం మీడియాకు వివరించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి కాబోతున్నాయని తెలిపారు. ఇప్పటికీ జాతర పనులు సగటున 85శాతం పూర్తి చేశారు. మిగిలిన పనులు 15వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. జాతర సందర్భంగా అవసరమైన నిధులు విడుదల చేశాం, పూర్తి చేసిన పనులకు 24గంటల్లో బిల్లులు మంజూరు చేస్తున్నామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. గతం లో జాతర నిర్వహణకు 75 కోట్లు, 100కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం 251 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ప్రధానంగా ఆరోగ్య, విద్యుత్, పంచాయతీ శాఖ

...:: మిగతా 2లో



ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి 25 % అదనపు జీతాలు ఉంటాయని అన్నారు. భారత రాష్ట్ర సమితి పది సంవత్సరాల పాలన వల్లే ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఆలస్యం జరిగిందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణ పనులపై ప్రతి సోమవారం సమీక్ష చేస్తామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండను సస్యశ్యామలం చేయడమే కాకుండా, ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా లేకుండా చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

యుద్ధప్రాతిపదికన ఎస్ఎల్‌బీసీ పనులు

- సొరంగం తవ్వకాలకు ఆధునిక పరిజ్ఞానం
- బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే పనులు ఆలస్యం
- ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండను సస్యశ్యామలం చేస్తాం
- ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా లేకుండా చేస్తాం
- పనుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 11: యుద్ధ ప్రాతిపదికన ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. సొరంగం తవ్వడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, ఇంజనీర్లతో మంత్రి సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. తొలగించిన టీబీఎం స్థానంలో అత్యాధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరపనున్నారని, మిగిలిన సొరంగ మార్గం 9.8 కిలోమీటర్ల పరిస్థితులపై సమాచారం అందించే ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పూర్తయినట్టు అధికారులు ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలిపారు. భూగర్భ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసే విధంగా సపోర్ట్ సిస్టం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి వివరించారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి 25 % అదనపు జీతాలు ఉంటాయని అన్నారు. భారత రాష్ట్ర సమితి పది సంవత్సరాల పాలన వల్లే ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఆలస్యం జరిగిందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణ పనులపై ప్రతి సోమవారం సమీక్ష చేస్తామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండను సస్యశ్యామలం చేయడమే కాకుండా, ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా లేకుండా చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.



ఉద్ధవ్‌పై ఫడ్నవీస్ సెటైర్లు..

ఏక్‌నాథ్ శిండే, ఉద్ధవ్ ఠాక్రేల వైరుధ్యాలు అందరికీ తెలిసిందే. ప్రస్తుతం వీరిద్దరి మధ్య సంబంధాలు ఉప్పునిప్పులా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అధినేత ఉద్ధవ్ ఠాక్రేపై కీలక వ్యాఖ్యలు చేశారు.

7

ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేస్తే సహించం



- అణాపైసాతో సహా వసూలు చేస్తాం
- ధరణి లొసుగులతో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టం
- రాష్ట్రవ్యాప్తంగా ఆడిటింగ్ నిర్వహిస్తాం
- భూభారతి పోర్టల్లో అక్రమాలకు కళ్లెం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

...:: 2లో



రేవంత్.. ఇప్పటికైనా మంచి పనులు చేయ్

- 2014కు ముందు కరెంటు పరిస్థితి ఎలా ఉండేది.. కేసీఆర్ వచ్చాక ఎలా మారిందో గుర్తుతెచ్చుకోవాలి
- ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారు
- బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.2.80 లక్షల కోట్లే
- రెండేళ్లలో రియల్ ఎస్టేట్‌ను తొక్కిపెట్టారు
- రేవంత్ రెడ్డికి వచ్చింది బూతుల భాష ఒకటే
- బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 11: ఇంకా మూడేళ్ల అధికారం ఉందని, ఇప్పటికైనా మంచి పనులు చేయాలని సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. ఆదివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్... బండ్లగూడ మాజీ మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ గులాబీ కండువా కాప్పి పార్టీలోకి

...:: మిగతా 2లో

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్

- వైబ్రంట్ గుజరాత్ సదస్సులో మోదీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో



రాజ్‌కోట్, జనవరి 11: భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా దూసుకెళ్తోందని, దేశంలో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ అనిశ్చితి మధ్య భారతదేశం అపూర్వమైన నిశ్చయత దశను చూస్తోందని పరోక్షంగా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలో ఇటీవల రాజకీయ కల్లోలాలను ప్రస్తావిస్తూ పేర్కొన్నారు. రాజ్‌కోట్‌లో ఆదివారం నాడు జరిగిన వైబ్రంట్ గుజరాత్ రీజినల్ కాన్ఫరెన్స్ ఫర్ కచ్ అండ్ సౌరాష్ట్ర రీజియన్‌లో ప్రధాని మాట్లాడుతూ, 'రిఫార్మ్, పర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్' అనే విజయ మంత్రమే భారతదేశ వృద్ధిని ప్రతిబింబిస్తోందన్నారు. మౌలిక వసతుల

...:: మిగతా 2లో



రాజకీయాల్లో వారసత్వం ప్రోత్సహించను

పరిపాలనాపరంగా రాష్ట్రాలుగా విడిపోయినా, తెలుగు ప్రజలంతా కలిసి మెలిసి ఉన్నారని, హైదరాబాద్ అమరావతి కూడా అభివృద్ధి చెందుతోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు.

7



రాష్ట్రీయం



ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేస్తే సహించం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 11:- ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో రెవెన్యూ అధికారులతో సమావేశమైన మంత్రి పొంగులేటి రాష్ట్రంలోని జనగాం తదితర ప్రాంతాల్లో బయటపడిన స్టాంప్ డ్యూటీ సొమ్ము చెల్లింపుల్లో అక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల లావాదేవీలపై ఆడిట్ నిర్వహించామని, మొత్తం 52 లక్షల లావాదేవీలలో 4,800 లోపాలు గుర్తించామని తెలిపారు. వీటిలో దాదాపు 3000 లోపాలు రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన మొత్తాన్ని తప్పకుండా రికవరీ చేస్తామని తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన ఆడిటింగ్ లో భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు చెల్లించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చలాన్ సొమ్మును పక్కదారి పట్టిన విషయాన్ని గుర్తించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడిన ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌లో ఆడిటింగ్ విధానం లేకపోవడమే ఇలాంటి అక్రమాలకు ప్రధాన కారణమని ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి, లోతైన విచారణ జరిపించి బాధ్యులెవరో తేల్చి చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. ఈ అక్రమాల్లో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందా లేదా అన్న అంశంపై కూడా లోతైన విచారణ జరపాలని, ఎవరైనా తప్పు చేసినట్టు తేలితే ఎంత పెద్దవారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి తేల్చిచెప్పారు. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చిన నాటి నుంచి గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన అన్ని లావాదేవీలపై రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఆడిటింగ్ నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ప్రభుత్వానికి రావలసిన ఒక్క పైసా సొమ్ము దుర్వినియోగం చేసినా సహించేది లేదని స్పష్టమైన హెచ్చరిక చేశారు. ప్రజల సొమ్ముతో ఆడుకున్న వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తామని, ఇలాంటి అక్రమాలకు ఇకపై తావు ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్

మొదటిపేజీ తరువాయి

కల్పనతోపాటు ఇండస్ట్రీరెడీ వర్క్‌ఫోర్స్ అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు గ్రోత్ ఇంజన్‌లా గుజరాత్ మారిందని, కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలు అవకాశాలకే పరిమితం కాకుండా దేశ ప్రగతికి బలమైన పునాదిగా మారాయని ప్రశంసించారు. 'భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. వ్యవసాయ ఉత్పత్తులు సరికొత్త రికార్డులు సృష్టించాయి. పాల ఉత్పత్తిలో నెంబర్ వన్ రికార్డు మనదే. వ్యాక్సిన్ల అతి పెద్ద ఉత్పత్తిదారు కూడా ఇండియానే. గత 11 ఏళ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ డేటా వినియోగదారుగా కూడా ఇండియా నిలిచింది' అని ప్రధాని తెలిపారు. మూడురోజుల పర్యటనలో భాగంగా శనివారం నాడు గుజరాత్‌లోని సోమనాథ్‌కు వచ్చిన ప్రధాని ఆదివారం నాడు స్వాభిమాన్ పర్వ్‌లో భాగంగా శౌర్య యాత్రలో పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీనికి ముందు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు.

రేవంత్.. ఇప్పటికైనా మంచి పనులు చేయ్

మొదటిపేజీ తరువాయి

ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లు తెలంగాణపై ఇష్టంతో పనిచేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 2014కు ముందు కరెంటు పరిస్థితి ఎలా ఉండేది.. కేసీఆర్ వచ్చాక ఎలా మారిందో గుర్తుతెచ్చుకోవాలని అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కరెంట్ సమస్యలు పరిష్కరించి.. అందరికీ నాణ్యమైన విద్యుత్ అందజేశారని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలు, పార్కులు కట్టుకున్నామని పేర్కొన్నారు. మన రాష్ట్రం, మన ప్రజల కోసం పనిచేశామనిచెప్పారు. కరోనా సమయంలో కూడా 40 లింక్ రోడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని కేసీఆర్ వినియోగించుకున్నారని అన్నారు. ప్రజలకు అలివికాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారని అన్నారు. కేసీఆర్ ప్రజలకు మంచి చేశారు కాబట్టే ఆయన్ను ప్రజలు మరిచిపోలేకపోతున్నారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ చేసిన అభివృద్ధితో భూముల ధరలు పెరిగాయని అన్నారు. అప్పట్లో రూ.5లక్షలు ఉన్న భూమి.. 30 నుంచి 50 లక్షలకు పెరిగిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ స్తంభించిందని పేర్కొన్నారు. రెండేళ్లలో రియల్ ఎస్టేట్‌ను తొక్కి పెట్టాడని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో భూముల రేట్లు తగ్గాయని అన్నారు. కళ్ల ముందటే ప్రజల ఆస్తి కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆస్తులు, బంగారం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారని రేవంత్ ఆరోజే చెప్పాడని అన్నారు.

ప్రజలకు అలివికాని హామీలిచ్చి..

ప్రజలకు అలివికాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారని అన్నారు. అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాడని అన్నారు. దేవుళ్లు, సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఒట్టు వేసి ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పాడని తెలిపారు. కేసీఆర్ 70 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్లు రైతుబంధు ఇచ్చాడని తెలిపారు. కేసీఆర్ రైతుబంధుతో అగ్రవర్ణాలకు కూడా మేలు జరిగిందని అన్నారు. రైతు సంపద పెరిగితేనే అన్ని వర్గాలు ఆనందంగా ఉంటాయని తెలిపారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2000 చేశారని తెలిపారు. పెన్షన్ ఏమైందని అడిగితే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి వచ్చింది ఒకటే భాష.. అది బూతుల భాష అని ఎద్దేవా చేశారు. లాగుల్లో తొండలు ఇడుస్తా.. పేగులు తీసి మెడలో వేసుకుంటానని అంటారని అన్నారు.

బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.2.80 లక్షల కోట్లే

రాష్ట్రం అప్పుల పాలైందని రేవంత్ రెడ్డి పదే పదే అంటాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అప్పుపై ఒక్కోకాంగ్రెస్ నేత ఒక్కోలా మాట్లాడతారని అన్నారు. ఒకరు రూ.6 లక్షల కోట్లు, మరొకరు 7 లక్షల కోట్లు.. ఇంకొకరు 8లక్షల కోట్లు అని చెప్పారని తెలిపారు. దీనిపై బీజేపీ ఎంపీ కేంద్రాన్ని అడిగితే.. కేసీఆర్ రూ.2లక్షల కోట్లు మాత్రమే అప్పు చేశారని చెప్పారని గుర్తుచేశారు. కాగ్ చెప్పిన లెక్కల ప్రకారం బీఆర్ఎస్ చేసిన అప్పు 2లక్షల 80 వేల కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. ఇక హైడ్రా పేరిట గరీబోళ్ల ఇళ్లు కూలగొడతారు కానీ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లు



మాత్రం ఈ ప్రభుత్వానికి కనబడవని మండిపడ్డారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఏం సాధించారని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని.. చెబితే వినడని ఎద్దేవా చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని అన్నారు. ఇంకా మూడేళ్ల అధికారం ఉంది.. ఇప్పటికైనా మంచి పనులు చేయాలని హితవు పలికారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని సూచించారు. నిరుద్యోగులు రోడ్లపైకి వస్తున్నారని తెలిపారు. అశోక్ నగర్ వెళ్లడానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నాడని అన్నారు. రేవంత్‌రెడ్డి 70వేల ఉద్యోగాలు కాదు.. 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు.



ప్రపంచ వ్యప్తంగా అనిశ్చితి నెలకొన్నా ప్రధాని మోడీ వల్ల ఇండియా సురక్షితంగా ఉంది. ఈ సవాళ్లు భారత్ ను ఇబ్బంది పెట్టలేవు. ఎందుకంటే మోడీ అనే రక్షణ గోడ ఉంది. స్వతంత్ర భారత దేశంలో ఇప్పుడు చూస్తున్న ఆశ, ఆత్మవిశ్వాసం, ఉత్సాహాన్ని గతంలో ఎన్నడూ చూడలేదు. రానున్న ఐదేళ్లలో గుజరాత్ లో రూ. 7 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాం.

- రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ

ఇరాన్‌లో ఆందోళన ఉధృతం

మొదటిపేజీ తరువాయి

మరణశిక్ష విధించే నేరంగా పరిగణిస్తామని ఇరాన్ అటార్నీ జనరల్ ఇదివరకే హెచ్చరించారు. అటార్నీ జనరల్ చేసిన హెచ్చరికను ఇరాన్ ప్రభుత్వ ఛానల్ ప్రసారం చేసింది. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను కట్టడి చేయాలని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఇరాన్ అల్లర్లను నిశింతంగా పరిశీలిస్తోన్న భారత్!

ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు హింసాత్మకంగా మారిన వేళ అక్కడి పరిస్థితులను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోంది. భారతీయులకు పొంచి ఉన్న ప్రమాదాన్ని అంచనా వేస్తోంది. విద్యుత్ సరఫరా, విమాన సర్వీసులను నిలిపివేసిన నేపథ్యంలో భారతీయులను తరలించేందుకు ఉన్న అవకాశాలపై కేంద్రం ఇప్పటికే పని మొదలు పెట్టినట్లు నిఘావర్గాలు తెలిపాయి. ఇరాన్‌లోని 31 ప్రావిన్స్‌ల పరిధిలోని 180నగరాలకు ఆందోళనలు వ్యాపించాయని అందులో దాదాపు 11లక్షల మంది ప్రజలు పాల్గొంటున్నారని పేర్కొన్నాయి. రాజధాని టెహ్రాన్, ఇరాన్ రెండో పెద్దనగరం మషహద్‌లో ఇవాళ కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేశారు. 2వారాలుదాటిన నిరసనల్లో ఇప్పటివరకు 203మందికిపైగా మృతిచెందినట్లు ఆందోళనకారులు తెలిపారు. 2వేల 6వందల మందిని అదుపులోకి తీసుకున్నట్లు అమెరికాకు చెందిన ఓ వార్తా సంస్థ తెలిపింది. ఇంటర్నెట్, ఫోన్‌లైన్లను నిలిపివేయటం వల్ల విదేశాల నుంచి పరిస్థితులను అంచనా వేయటం



కష్టంగా మారినట్లు పేర్కొంది.

నిరసనకారులకు అమెరికా మద్దతు!

మరోవైపు, నిరసనకారులపై కాల్పులు జరిగితే అమెరికా జోక్యం తప్పదని, చావు దెబ్బ కొడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇదివరకే హెచ్చరించారు. అక్కడ జరుగుతున్న నిరసనలను అమెరికా ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, నిరసనకారులు సురక్షితంగా ఉండాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో జరిగినట్లే ప్రజలను చంపడం మొదలు పెడితే మేం జోక్యం చేసుకుంటామని పేర్కొన్నారు. ఇరాన్ కాల్పులు జరిపితే, తాము కూడా కాల్చాల్సి వస్తుందని అన్నారు. మా సైనికులు మీ గడ్డపైకి దిగకపోవచ్చు, కానీ మిమ్మల్ని ఎక్కడ కొడితే నొప్పి తెలుస్తుందో మాకు బాగా తెలుసని ట్రంప్ చెప్పారు. అత్యంత కఠినంగా మిమ్మల్ని దెబ్బకొడతాం గట్టి వార్నింగ్ ఇచ్చారు.

తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక 'మేడారం' జాతర

మొదటిపేజీ తరువాయి

అధికారులు జాతర పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని వీరితో పాటు యావత్ శాఖల సిబ్బంది అధికారులు జాతరను సీరియస్ గా తీసుకోవాలని ఆదేశించారు.

జాతరకు ముందే భక్తుల రద్దీ: సీతక్క

మేడారానికి ఈ రోజు ప్రతి గంటకు సగటున వెయ్యి వాహనాలు చేరుకున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. రానున్న రోజుల్లో వాహనాల రాక మరింతగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ రోజు దాదాపు ఐదు లక్షల మంది భక్తులు దర్శనంచేసుకున్నారని వెల్లడించారు. మేడారం జాతర పనులపై తాను అక్కడే ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జాతర సమయంలో ప్రజల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తొక్కిసలాట వంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రౌడ్ కంట్రోల్‌కు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు తమ శాఖ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు.

మేడారం మాస్టర్ ప్లాన్‌తో దర్శన సామర్థ్యం పెంపు..

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మేడారం జాతర పనుల పురోగతిపై ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఐటీ పరిశ్రమల శాఖ



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేడారంలో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర తొలుత జాతర పనుల వివరాలను మంత్రులకు వివరించారు. దాదాపు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ నెల 15వ తేదీలోపు పూర్తిచేస్తామని ఆయన వెల్లడించారు. ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన కొన్ని పనులు స్వల్పంగా మిగిలి ఉన్నప్పటికీ, నిత్యం భక్తుల రద్దీ దృష్ట్యా కొంత ఆలస్యం అయినా నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మేడారం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మేడారం ప్రాంతాన్ని పూర్తిగా కోర్ ఏరియా, పెరిఫెరల్ ఏరియాలుగా విభజించినట్లు కలెక్టర్ తెలిపారు. కోర్ ఏరియాలో కేవలం దేవాలయ ప్రాంతం మాత్రమే ఉండేలా రూపకల్పన చేశామని చెప్పారు. గత జాతరలో కోర్ ఏరియా విస్తీర్ణం సుమారు 32 వేల చదరపు అడుగులు ఉండగా, ఈసారి దాన్ని 54 వేల చదరపు అడుగులకు పెంచినట్లు వివరించారు.ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్ అండ్ బి ఈ ఎన్ సి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీఓ వెంకటేష్, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో కుటుంబ వారసత్వం ప్రోత్సహించను

- అందుకే నా పిల్లలు రాజకీయాల్లో రాలేదు
- మన పండుగలన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్నాయి
- పరిపాలనాపరంగా రాష్ట్రాలు విడిపోయినా
- తెలుగు ప్రజలంతా కలిసి మెలిసి ఉన్నారు
- హైదరాబాద్ తరహాలో ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి
- మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్య నాయుడు
- స్వర్ణభారత్ ట్రస్టులో సంక్రాంతి వేడుకలు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 11: పరిపాలనాపరంగా రాష్ట్రాలుగా విడిపోయినా, తెలుగు ప్రజలంతా కలిసి మెలిసి ఉన్నారని, తెలంగాణ రాజధాని హైదరాబాద్ తరహాలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కూడా అభివృద్ధి చెందుతోందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబురాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు, ప్రముఖ సినీ నటులు బ్రహ్మానందం, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, ప్రకాశ్ గౌడ్, ముప్పవరపు ఫౌండేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్, స్వర్ణ భారత్ ట్రస్టు ట్రస్టీ దీపా తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన "ముప్పవరపు ఫౌండేషన్" భవనం ప్రారంభోత్సవం చేశారు.

ఇద్దరు సీఎంలు అంగీకరించారు

సంక్రాంతి పండుగ మన జీవితాల్లో నవ్యక్రాంతి తీసుకురావాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. మూలాల్లోకి వెళ్లి బంధు, మిత్రులతో కలిసి సామూహికంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మన మాతృభాష తెలుగు సంరక్షణ కోసం ఇటీవల దివంగత రామోజీరావు జయంతి వేళ ఆయన గుర్తుగా పరిపాలన తెలుగులో చేయాలని ఇరు రాష్ట్రాల సీఎంలకు సూచించానని వెంకయ్య నాయుడు తెలిపారు. ప్రసంగాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో కొనసాగాలన్న సూచన మేరకు ఇద్దరు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి అంగీకరించారని గుర్తు చేశారు. తాజాగా ఒక సమీక్షలో కలెక్టర్ ఆంగ్లంలో మాట్లాడబోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారించి తెలుగులో మాట్లాడించారని గుర్తు చేశారు. రాజకీయాల్లో కుటుంబ వారసత్వం తాను ప్రోత్సహించబోనని, అందుకే తన పిల్లలను రాజకీయాల్లోకి తీసుకురాలేదని స్పష్టం చేశారు. మన భవిష్యత్ బాగుండాలంటే ప్రకృతితో కలిసి జీవించాలి. మన పండగలన్నీ కూడా ప్రకృతితో ముడిపడి ఉన్నాయి అని తెలిపారు. పంటలన్నీ ఇంటికి చేరే రోజుల్లో సంక్రాంతి పండగ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ మధ్య వాతావరణ మార్పుల వల్ల రుతువులు మారుతున్నట్లు ఉంది. మనుషులు మారుతున్నట్లే రుతువులూ మారుతున్నాయని తనదైనశైలిలో వివరించారు. ఎన్ని మారినా మన సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలని, తెలుగులో చక్కని పిలుపులు ఉన్నాయన్నారు. సోదరుడిని బ్రోకర్ అని పిలిచినట్లు బ్రో అని అంటున్నారంటూ ఎద్దేవా చేశారు. మదర్ ఇన్‌లా, ఫాదర్ ఇన్‌లా అని అంటున్నారు. ఇది మారాలి." వెంకయ్యనాయుడు కోరారు.

సరైన రాజధాని నగరం అమరావతి

ఏపీ రాజధాని అమరావతి విషయంలో అనవసర వివాదాలు వద్దని వెంకయ్యనాయుడు సూచించారు. గుంటూరు, విజయవాడ, గన్నవరం ఇలా కొన్నిప్రాంతాలు కలిపి అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని విజ్ఞప్తి చేశారు.

అదే నా వారసత్వం

24 ఏళ్ల కింద తమ సొంత గడ్డ నెల్లూరులో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఆ తర్వాత విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో కూడా ఛాప్టర్లు ప్రారంభించి యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మహిళా సాధికారత, వైద్య సేవలందిస్తున్నామని అన్నారు. తన వారసత్వంగా ముప్పవరపు ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ ద్వారా ఆ సేవలు ముందుకు తీసుకెళ్లే బాధ్యత తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపకు అప్పగించానని, అదే తన వారసత్వం అని వెంకయ్యనాయుడు వెల్లడించారు. సంక్రాంతి పండగ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా జరుపుకోవడం అనవాయితీగా వస్తుందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. సంక్రాంతి వేళ ప్రతి ఒక్కరూ జన్మభూమి వెళ్లి పాత జ్ఞాపకాలు నెమరువేసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారని తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను అద్భుతమైన సంస్థగా తీర్చిదిద్దడం ద్వారా ఎంతో మందికి సేవలు అందిస్తుండం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు "సంక్రాంతి ప్రాశస్త్యం" ప్రవచనం వినిపించారు. అమరావతి కూడా హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చెందాలి, చెందుతుంది. సందేహం లేదని వెంకయ్యనాయుడు ధీమా వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న చర్యలకు కేంద్రం మద్దతు ఇస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళితే ఆ పక్కన సముద్రం ఉంటుందని, ఏపీలో అన్ని ప్రాంతాలకు సరైన రాజధాని నగరం అమరావతి అని ఉద్ఘాటించారు. ఇక ఈ విషయంలో ఎలాంటి అనవసరమైన వివాదాలు వద్దని నరసింహారావు కోరారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన

- ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అన్ని రంగాల్లో అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, పెద్దపల్లి, జనవరి 11: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందిస్తూ ముందుకు పోతుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అన్ని రంగాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ ప్రగతిని సమపాళ్లలో తీసుకెళ్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా పర్యటనలో భాగంగా రామగుండం మున్సిపాలిటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు, స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రామగుండం స్థానిక శాసనసభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ప్రజా సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 586 మంది నిరుపేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు, 494 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో పాటు రాష్ట్రంలో మొదటిసారిగా 50 మంది ట్రాన్స్ జెండర్స్‌కు ఇండ్ల పత్రాలను అందించారు. సింగరేణి పరివాహక ప్రాంతంలో 76 జీవో వల్ల నెలకున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సహచర మంత్రులతో చర్చించి అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలను అందజేస్తామన్నారు. అవినీతి ప్రభుత్వాన్ని పాతరేసి ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకున్న ప్రజలు ఇప్పటివరకు జరిగే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా నిలిచారని, రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు మద్దతు పలికి మనస్ఫూర్తిగా ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నానని అన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి అడ్రస్ లేకుండా ప్రతి ఎన్నికల్లో ఓడిస్తూనే ఉన్నారని, సొంత ఇంటి ఆడబిడ్డకు న్యాయం చేయలేని నాయకులు తెలంగాణ మహిళలకు ఎలా న్యాయం చేస్తారో సమాధానం చెప్పాలని అన్నారు. పదేండ్లలో ప్రజల కష్టనష్టాలను పట్టించుకోని నేతలు ప్రజా పాలనను విమర్శించడం హాస్యాస్పదమని అయన ఎద్దేవా చేశారు.

రేవంత్ రెడ్డి సామాజిక విప్లవకారుడు

- నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 11: కాంగ్రెస్ జాతీయ నాయకుల ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పరిపాలన సాగిస్తున్నారని నాగర్ కర్నూల్‌ఎంపీ మల్లు రవి తెలిపారు. సామాజిక విప్లవకారుడిగా రేవంత్ రెడ్డి ఒక అద్భుతమైన పాలన చేస్తున్నారంటూ కితాబిచ్చారు. మొదటి నుంచి సమాజంలో ఉన్న అనేక సామాజిక రుగ్మతలను కాంగ్రెస్ పాలకులు నిర్మూలించారని మల్లు రవి అన్నారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక మంది ప్రధాన మంత్రులు వారి వారి పాలనా కాలంలో అనేక సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఓ ప్రకటనలో తెలిపారు. పేదరిక నిర్మూలన, గరీబి హటావో, పేదలకు భూముల పంపిణీ, 20 సూత్రల పథకం అమలు, ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం, పంచాయతీ లకు నేరుగా నిధులు, 18 ఏళ్లకే ఓటు హక్కు, జాతీయ ఉపాధి హామీ పథకం, ఆర్థిక సంస్కరణలు తదితర అనేక సామాజిక విప్లవాత్మక మార్పులు కాంగ్రెస్ ప్రధాన మంత్రుల కాలంలో జరిగాయన్నారు. రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నాయకులుగా దేశవ్యాప్త పాదయాత్ర చేశారని, ఆయన కుల గణన చేసి ప్రభుత్వ ఫలాలు అందరికి వారి వారి వాటా ప్రకారం అందించాలని ప్రకటించారని వివరించారు. కాంగ్రెస్ జాతీయ నాయకుల ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. .సామాజిక డాక్టర్ గా, సామాజిక విప్లవకారుడు గా రేవంత్ రెడ్డి ఒక అద్భుతమైన పాలన చేస్తున్నారంటూ కితాబిచ్చారు. బీసీ రిజర్వేషన్లు విషయంలో ఎక్కడ తగ్గకుండా అన్ని రకాలుగా రాజకీయ, చట్ట పరమైన, న్యాయ పరమైన, సాంకేతిక పనులు చేశారని మల్లు రవి తెలిపారు. అలాగే వైస్ ఛాన్సలర్ల నియామకాలలో సామాజిక న్యాయం పాటించి ఉస్మానియా యూనివర్సిటీ కి వందేళ్ళల్లో లేని విధంగా ఒక దళిత సామాజిక వర్గ వ్యక్తికి అవకాశం ఇచ్చారని అన్నారు. రాజకీయ సంస్కరణలతో రేవంత్ రెడ్డి ఒక సామాజిక డాక్టర్ లాగా పని చేస్తున్నారని. ఆయన పాలన వందేళ్లు వర్ధిల్లాలని తెలంగాణ సమాజం కోరుకుంటుంన్నదని మల్లు రవి తెలిపారు.



సంక్రాంతికి ఊరెళ్లిన జనం

- రోడ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిట
- విజయవాడ, కర్నూల్ రహదారుల్లో వాహనాల రద్దీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 11: భాగ్యనగరం పల్లె బాట పట్టింది. సంక్రాంతిని నగర ప్రజలు ఊరి బాట పట్టారు. నగరంలోని ప్రధాన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. గడిచిన మూడు రోజుల్లోనే నగరం నుంచి సుమారు 30 లక్షల మందికి పైగా ప్రజలు తమ స్వగ్రామాలకు తరలివెళ్లారు. దీంతో ఎప్పుడు కిటకిటలాడే హైదరాబాద్ రహదారులు బోసిపోయాయి. హైదరాబాద్‌నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఇతర జిల్లాలకు వెళ్లే ప్రజలతో ప్రధాన కూడళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రధాన కేంద్రాలైన దిల్‌సుక్ నగర్, ఉప్పల్, ఎల్బీనగర్, హయత్ నగర్, జేబీఎస్, ఎంజీబీఎస్‌బస్టాండ్లలో ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. బస్టాండ్లు ప్రయాణికులతో నిండిపోయినప్పటికీ.. సమయానికి బస్సులు రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బస్టాండ్లలో కిక్కిరిసిన ప్రయాణికులు..

స్వగ్రామాలకు వెళ్లేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో బయలుదేరడంతో బస్టాండ్లన్నీ రద్దీగా మారాయి. టిక్కెట్లు దొరక్క, బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలతో వచ్చిన వారైతే.. మరిన్ని తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రయాణికుల డిమాండ్ భారీగా పెరగడంతో సోమవారం వరకు బస్సులు, రైళ్లలో అన్ని రిజర్వేషన్లు పూర్తిగా ఫుల్ అయ్యాయి. ఆన్‌లైన్, కౌంటర్ రిజర్వేషన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ఆర్టీసీ, రైల్వే శాఖలు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నప్పటికీ, ప్రయాణికుల సంఖ్యకు అవి సరిపోవడం లేదు. రేపటి వరకు అన్ని ప్రధాన రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో రిజర్వేషన్లు పూర్తిగా నిండిపోయాయి. సమయానికి బస్సులు రాకపోవడం ప్రయాణికుల సమస్యలను మరింత పెంచుతోంది. షెడ్యూల్ ప్రకారం బస్సులు నడవకపోవడంతో బస్టాండ్లలో గందరగోళం నెలకొంది. కొన్నిచోట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను ప్రశ్నించారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రద్దీని నియంత్రించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్రయివేటు ట్రావెల్స్ దోపిడీ..

రిజర్వేషన్లు దొరక్కపోవడంతో చాలా మంది ప్రయివేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్నే అవకాశంగా తీసుకుని, ప్రయివేట్ బస్సుల్లో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వాహనాల్లో సీట్లు దొరకని ప్రయాణికులు చేసేదేమీ లేక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్ని అదునుగా చేసుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు.. సాధారణ చార్జీల కంటే మూడు రెట్లు అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికుల నుంచి రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

ట్రాఫిక్‌తో నరకం

హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లే ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. ముఖ్యంగా విజయవాడ వైపు వెళ్లే పంతంగి టోల్ ప్లాజా, కర్నూల్ వెళ్లే రాయికల్ టోల్ ప్లాజా, వరంగల్ వైపు వెళ్లే రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అధికారిక లెక్కల ప్రకారం, గడిచిన మూడు రోజుల్లో హైదరాబాద్ నగరం నుంచి 30 లక్షల మందికి పైగా ప్రయాణికులు తరలివెళ్లినట్లు సమాచారం.



రాష్ట్రంలో ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయండి

- సీఎం రేవంత్ రెడ్డికి ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి విజ్ఞప్తి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి11: రాష్ట్రంలో ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఈబీసీ జాతీయ అధ్యక్షులు, అగ్రకులాల నిరుపేదల సంఘాల జేఏసీ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఈబీసీల అభివృద్ధికి మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని, ఈబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అన్నిటినీ అగ్రవర్ణాలలోని నిరుపేదలకు వర్తింపజేయాలని రవీందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అగ్రవర్ణాల వారిలో 90 శాతం మంది నిరుపేదలున్నారని రవీందర్ రెడ్డి తెలిపారు. పేరుకే అగ్రవర్ణాలని అడుగడుగునా బీదరికాన్ని అనుభవిస్తున్నారని వివరించారు. అగ్రవర్ణాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, ఈబీసీ విద్యార్థులకు స్టడీ సర్కిల్స్, గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయోపరిమితిలో సడలింపు ఇచ్చినట్లుగానే ఈబీసీలకు కూడా వయోపరిమితి సడలింపు ఇవ్వాలని రవీందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



పోరాట యోధుడు వడ్డే ఓబన్న

- జిల్లా గ్రంథాలయాల చైర్మన్ కేడం లింగమూర్తి

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 11: బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఎదిరించిన పోరాట యోధుడు వడ్డే ఓబన్న అని సిద్దిపేట జిల్లా గ్రంథాలయాల చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. ఆదివారం తొలి తరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 219వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ వడ్డెర జన చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారత దేశంలో బ్రిటిష్ పాలకుల ఆగడాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు వడ్డే ఓబన్న అని, అనేక మంది పోరాట యోధుల త్యాగాలతో మన దేశంలో ప్రజాస్వామ్యం బలపడిందన్నారు. వడ్డెర సోదరులు వర్క్ షాప్ పేరిట సామాజిక, రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఊరికి మంచి నీటి బావులు, రాజుల కోటలు, అసెంబ్లీ భవన్ నిర్మాణం, చెరువు ల నిర్మాణాలు వడ్డెర సోదరుల శ్రమ ఫలితమేనని, బ్రిటిష్ పాలకుల ను ఎదిరించిన వీరుడు వడ్డే ఓబన్న అని అన్నారు. జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గం కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ స్నేహానికి, ధైర్యానికి మారు పేరు, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తెలుగు నాట తొలిసారి సవాల్ చేసిన సైరా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి మిత్రుడు వడ్డే ఓబన్న అని, జీవితం లోను, పోరాటం లోను, మరణం లోను స్నేహితుడు గా వెంట నిలబడ్డాడని అన్నారు. ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్ మాట్లాడుతూ మాతృ భూమి విముక్తి కోసం ప్రాణాలర్పించిన పోరాట యోధుడు వడ్డే ఓబన్న అని, గ్రామీణ రక్షణ వ్యవస్థ, సరిహద్దుల వ్యవస్థ లో అపార అనుభవం కలిగిన సేనాధిపతి వడ్డే ఓబన్న అని, వడ్డే ఓబన్న జీవిత చరిత్ర ను పాఠ్య పుస్తకాలలో పెట్టాలని, వడ్డెర సోదరులు ఉన్నత చదువులు చదవాలని, రాజకీయం గా ముందుండాలని అన్నారు. తెలంగాణ వడ్డెర జన చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వెంకటేష్ మాట్లాడుతూ వడ్డేరులందరు ఐక్యం గా ఉండాలని, వడ్డే ఓబన్న ఆశయాలను కొనసాగించాలని, వడ్డే ఓబన్న విగ్రహం ను ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం వడ్డెర ప్రజాప్రతినిధులను శాలువా లతో సన్మానం చేసారు. ఈ కార్యక్రమం లోహుస్నాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిత్తారి రవీందర్, అక్కన్నపేట వడ్డెర సంఘము అధ్యక్షులు కుమార్, వడ్డెర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దోపిడీ రహిత సమాజమే సీపీఐ లక్ష్యం

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్
- హుస్నాబాద్ లో జనసేవా దళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభం

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 11: నేటి యువతలో శారీరక ధృడత్వంతో పాటు మానసిక పరివర్తన, సమాజం పట్ల అవగాహన అవసరమని సిద్దిపేట జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి జన సేవాదళ్ శిక్షణ శిభిరం సందర్భంగా అరుణ పతాకాన్ని గడిపె మల్లేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడిపె మల్లేశ్ మాట్లాడుతూ దేశంలో దోపిడీ రహిత సమాజం, అంతరాలు లేని సమసమాజమే సీపీఐ పార్టీ లక్ష్యమని సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ పొందాలని గడిపె మల్లేశ్ సూచించారు. భారత గడ్డపై సీపీఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభలు ఈ నెల 18న ఖమ్మం జిల్లా కేంద్రంలోని జరగనున్నాయని, ఈ సభలకు 40 దేశాల ప్రతినిధులు, 5 లక్షల మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు హాజరుకానున్నట్లు గడిపె మల్లేశ్ తెలిపారు. ఈ సభల్లో దేశ, రాష్ట్ర రాజకీయాలపై భవిష్యత్తు పోరాట కర్తవ్యాలపై చర్చించి పార్టీ పోరాట కార్యాచరణ రూపొందిస్తారని గడిపె మల్లేశ్ తెలిపారు. జన సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర ఇన్ స్ట్రక్టర్ గోసిక మెహన్ తో పాటు కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కనుకుంట్ల శంకర్, సీపూ ఈఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ గౌడ్, కిష్టపురం లక్ష్మణ్, అందె అశోక్, జేరిపోతుల జనార్దన్, కోహెడ మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, బెజ్జంకి మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజకుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగాళ్ల నరేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిట్యాల శేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి అంతయ్య, వలబోజు నర్సింహా చారి, నంగి కనకయ్య,సుంకోజు రజిత,బిచ్చాల శ్రీనివాస్, బంగారు ప్రేమ్ కుమార్, వానరాసి నరేందర్, దొంతరవేణి మహేష్, శ్రావణ్ కుమార్,సత్తయ్య, మల్లారెడ్డి, రజిత, శ్రీలత, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ మన లక్ష్యం కావాలి

- మోదీ రాకతో ఆర్థికంగా దేశం పురోగతి
- బీజేపీ రాష్ట్ర చీఫ్ రామచందర్ రావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 11: నగరంలో నిర్వహించిన 'వీబీ జీ రామ్ జీ(వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ)' రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. 'వీబీ జీ రామ్ జీ' అనేది మన స్వప్నమని.. వికసిత్ భారత్ మన లక్ష్యం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మోదీ రాకతో దేశం ఆర్థికంగా ఎంతో పురోగతి సాధించిందని రాంచందర్ రావు చెప్పుకొచ్చారు. 'కాంగ్రెస్ హయాంలో దేశం ఆర్థికంగా 11 స్థానంలో ఉండేది. మోదీ వచ్చాక ఆర్థికంగా 4వ స్థానంలోకి వచ్చాం. త్వరలో మొదటి స్థానంలోకి వస్తాం. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. ఆ సంస్కరణల్లో భాగమే వీబీ జీ రామ్ జీ. గ్రామీణ ప్రాంతంలో ఖర్చుచేస్తున్న నిధులు ఎంతవరకు ప్రజలకు చేరుతున్నాయనేది స్పష్టంగా తెలుస్తుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం లక్ష కోట్ల రూపాయలు కేటాయించింది. మోదీ వచ్చాక రూ.8 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, బెంగాల్‌లలో పెద్దఎత్తున అవినీతి జరిగింది. దానిని అరికట్టేందుకే ఈ మార్పు. పాలనలో పారదర్శకత తీసుకొచ్చేందుకే ఈ కొత్త చట్టం. రాష్ట్రాలు భాగస్వామ్యం వహించినప్పుడే బాధ్యత పెరుగుతుంది' అని రాంచందర్ రావు అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై రాంచందర్ రావు విమర్శలు గుప్పించారు. 'కాంగ్రెస్‌కు అవినీతి కావాలి. అవినీతి చేసేందుకే కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది.

బీజేపీ ప్రతీపథకాన్ని రాహుల్ వ్యతిరేకిస్తున్నారు...

"రేవంత్ రెడ్డి.. మీరు అడగాల్సింది మోదీని కాదు, రాహుల్‌ను. బీజేపీ తీసుకొచ్చే ప్రతి పథకాన్నీ వ్యతిరేకించడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి 40 శాతం కేటాయిస్తే తప్పేంటి?. కాంగ్రెస్‌కు నిజంగా సిగ్గుంటే రాజీవ్ గాంధీ ఎయిర్‌పోర్టుకు మహాత్మా గాంధీ పేరు పెట్టండి. మోదీకి మంచిపేరు వస్తుందన్న ఉద్దేశంతోనే వ్యతిరేకిస్తున్నారు. గ్రామగ్రామాన తిరిగి కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. మోదీ లేకుంటే ప్రజలకు ఉచిత బియ్యం, జాతీయ రోడ్లు వచ్చేవా?. యూనివర్సిటీల భూములు, ఇండస్ట్రియల్ భూములను లాగేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ప్రజాధనాన్ని దోచుకున్నాయి. వీబీ జీ రామ్ జీ పథకం రెండు విధాలుగా ప్రజలకు మేలు కలిగిస్తుంది. దానికి 40 శాతం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం బాధపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది మోదీకి కాదు.. ప్రజలకు. కిందిస్థాయికి తీసుకెళ్లే బాధ్యత మనదే" అని రాంచందర్ రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంచందర్ రావుతో పాటు బీజేపీ రాష్ట్ర సంస్థాగత ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్ తివారీ తదితరులు పాల్గొన్నారు.



2026 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుంది. 2014లో 11శాతం ఓట్లు వస్తే 2024లో 20 శాతానికి పెరిగాయి. త్వరలో 40 శాతం సాధిస్తాం. కేరళ వంతు వచ్చింది. ఇక్కడ కచ్చితంగా బీజేపీ సీఎం ఎన్నకవుతారు. బీజేపీ, ఎన్డీయే అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాం.

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

బహుళ

సంస్మరణ

చిలకలా జోహార్.. వరి మొలకలా జోహార్...

ఓ ఫజుల్ రహ్మాన్.. ఓ మునీర్.. ఓ వరంగల్ సలీమ్.. వీళ్లందరికన్నా ముందు గులామ్ రసూల్... తెలంగాణ తెలుగు పాత్రికేయ రంగానికి అందించిన ముస్లిం జర్నలిస్టు మిత్రులు.. రమేశ్ హజారీ మాటల్లో వీళ్లు "జర్నలిస్టులు- జనం మనుషులు".



పెండ్యాల కొండల్
7569495833

ఫజుల్ మృతి అనంతరం పత్రికల ఆర్కైవ్స్ ను నా మనసులో తిరగేసినప్పుడు ఉత్తర తెలంగాణ కు, ఇక్కడి పల్లెలకు, పల్లె ప్రజానీకానికి స్ఫూర్తిదాయక చైతన్యాన్ని అందించడానికి ప్రస్తుతం అమరులైన ఈ నలుగురు జర్నలిస్టులు చేసిన కృషి చెప్పాలనిపించింది. వీళ్లలో గులామ్ రసూల్ విద్యార్థి దశ నుంచే పత్రికా రంగాన్ని ఎంచుకొని ఉదయం సమయం పత్రికల్లో పనిచేస్తూ మజీద్ గూడ ప్రాంతంలో జరిగిన బూటకపు ఎన్ కౌంటర్ లో నక్సలైట్ ముద్ర పడటం వల్ల మృతి చెందాడు. అప్పటికే ఆయనది పదునైన కలం. మునీర్ భాయ్ సింగరేణి కార్మిక చైతన్యానికి ప్రతీక. ఆయన రాతలు కార్మిక వర్గం ఉద్యమోన్ముఖులయ్యే రీతిలో ఉపకరించాయి.

ఆయనది ప్రజాకలం.

సలీమ్ పరకాల ప్రాంత గ్రామీణ జర్నలిస్టు. సగటు గ్రామీణ జర్నలిస్టుల వలె ఒడిదొడుకుల జీవితం. మద్య పానానికి బానిసైనా ఆయన కలం పరకాల ప్రాంత ప్రజల పక్షాన వార్తలు వెలువరించింది..

ఇక ఫజుల్ భాయ్

భాష పై పట్టు. పుస్తక పఠనం పై మక్కువ.. వార్తారచనలో మెలుకువలు. ఎడిట్ పేజీ నిర్వాహకుడిగా ఉన్నా సింపుల్ జర్నలిస్ట్ లుక్. ఈ నలుగురూ మిగతా అనేక తెలుగేతర మాతృభాష కలిగిన తెలుగు జర్నలిస్టుల లాగే జనం మనుషులు... వాళ్లకు నా వినమ్ర జోహార్...

జర్నలిస్టులూ... జీవితాలు

ఈ వారం మిత్రుడు ఫజుల్ రహ్మాన్ గారు క్యాన్సర్ తో మృతి చెందింతర్వాత జర్నలిస్టుల జీవితాల గురించి తరచి చూడాలని అనిపించింది. తెలంగాణ లో తెలుగు పత్రికా రంగాన్ని ఎంచుకొని జర్నలిస్టులుగా సమాజ చైతన్యానికి ఉపకరించిన నలుగురు ముస్లిం జర్నలిస్టులను గురించి గుర్తొచ్చింది. గమ్మత్తేందంటే నలుగురిలో ముగ్గురితో కలిసి నేను పనిచేసా.

ముందుగా గులామ్ రసూల్. రసూల్ ఎన్ కౌంటర్లో మృతి చెందినట్టు ప్రకటించిన తర్వాత గానీ ఆయన అభ్యుదయభావజాలం తెలియలేదు. రసూల్ అప్పటికే ఉదయం దినపత్రికలో పనిచేసాడు. అయితే ఆజమాబాద్ లోనే రోడ్డుకిటువైపు ముజీబ్ ఖాన్ నేతృత్వంలో ముకుందన్ సి మీనన్ ఎడిటర్ గా సమయం అనే దినపత్రిక తీసుకురావాలని అనుకున్నప్పుడు రసూల్ నా సహచరుడు.

ఫజుల్ భాయ్ ఎడిటోరియల్ పేజీ ఇన్ ఛార్జి గా పనిచేయగలిగే సామర్థ్యం , భాషపట్ల గురి, వృత్తి పట్ల అచంచలమైన ప్రేమ కలిగిన వాడు. ఆయన వార్త దినపత్రిక ఆరంభంలో హుజురాబాద్ నుంచి అనుకుంటా గడ్డం



రాజిరెడ్డి , అంజనేయులు తో కలిసి నెట్ వర్క్ లో పనిచేసారు. హుస్నాబాద్ లో అన్నవరం దేవేందర్ గారు ఉన్నట్టు గుర్తు. నేను, సృజన్, మంథని గిరిధర్ మా ముగ్గురితో బాటు కరీంనగర్ డీపీఆర్వోగా పనిచేసి ఇప్పుడు వేరే జిల్లాలో చేస్తున్న పీ శ్రీనివాస్ డెస్క్ లో ఉండేవాళ్లం. వార్తా రచన లో మెళకువలు, సాహిత్య అభిరుచి , కవిత్వం లో ప్రవేశం ఉన్న ఆవునూరి సమ్మయ్య గారు, అన్నవరం దేవేందర్ గారు, ఫజుల్ గారు వీళ్లంతా భాషపట్ల పట్టు ఉన్నవాళ్లే అయినా తమతమ ప్రాంతాల్లోనే పనిచేయాలని భావించటం వలన మొదట్లో మొఫసిల్ కే పరిమితమయ్యారు. అయితే ఫజుల్ భాయ్ అనంతర కాలంలో డెస్క్ సైడ్ రావటం, ప్రధాన తెలుగు దినపత్రికల ఎడిట్ పేజీలు చూడటం ఆయన పరిణతిని పెంచాయి. మొన్న ఫజుల్ భాయ్ చనిపోయాక తెలుగు పత్రిక మీడియా రంగానికి సేవచేస్తూ మృతి చెందిన మిత్రులను గురించి ఓ సారి స్కాన్ చేసుకున్నా. వరంగల్ నుంచి మిత్రుడు సలీమ్ గుర్తొచ్చాడు. ఆయన మంచి క్రికెట్ ప్లేయర్ కూడా. అయితే సహజంగానే గ్రామీణ జర్నలిస్టులు ఎదుర్కొనే ఆర్థిక సమస్యల పర్యవసానంగా సలీమ్ మద్యానికి బానిసై అసువులు బాసాడు. ఆయనది మంచి పెన్. వరంగల్ లో ఇంకా ఎదగాల్సిన బండి రవీందర్ అనే జర్నలిస్ట్ బ్రెయిన్ ట్యూమర్ కారణంగా మృతిచెందాడు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినప్పుడు ఆయన హెచ్ ఎం టీవీ ప్రతినిధి. టీవీ జర్నలిజానికి ఆయనను పరిచయం చెయ్యాలనే ఆలోచన నాదీ, జకీర్ సర్ ది. అప్పటికి ఆయన చిట్యాల లో విశాలాంధ్ర రిపోర్టర్. వీళ్లను గురించి చెప్పుకుంటున్న క్రమంలో ఫజుల్ భాయ్, సలీమ్ భాయ్, గులామ్ రసూల్ ల తరహాలోనే ప్రజా జర్నలిస్టుగా అసువులు బాసిన మునీర్ భాయ్ గుర్తొచ్చాడు. ఆయన ఆచరణ, ఆయన రచనా వ్యాసంగం అనిర్వచనీయమైనవి. సింగరేణి మట్టిబిడ్డ గా కార్మిక చైతన్యాన్ని రేకెత్తించిన మునీర్ భాయ్ ది కూడా అకాల మరణమే. మంచోడి చావు మరణాన చూడు అన్నట్టు తెలుగు పత్రికా రంగం గుర్తుంచుకోదగ్గ తెలంగాణ జర్నలిస్టులైన వీళ్లను స్మరించటం పత్రికారంగం మనుగడ దృష్ట్యా, విశ్లేషణ లో నిబద్ధత దృష్ట్యా సదా అవసరం .

పరిచయం

భారతీయ సాహిత్యంలో ప్రసిద్ధ సంస్కృత పండితుడు

హిందీ,ఆంగ్ల రచయిత రాజస్థానీ కళానాథ శాస్త్రి



డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ లో జూలై 15,1936న జన్మించిన ప్రసిద్ధ సంస్కృత పండితుడు, భాషావేత్త దేవర్షి కళానాథ్ శాస్త్రి 1998లో భారత రాష్ట్రపతిచే సత్కరించబడిన భారతీయ సంస్కృత పండితుడు. ఆయన ఒక చరిత్ర అధ్యయన భారతీయ శాస్త్రవేత్త (ఇండోలాజిస్ట్) మరియు సంస్కృతం, హిందీ ఇంకా ఆంగ్ల భాషలలో గొప్ప రచయిత, అట్లాగే ప్రసిద్ధ భాషావేత్త, భారతీయ భాషలలో సాంకేతిక పరిభాషను అభివృద్ధి చేయడానికి, మరి రాజస్థాన్ రాష్ట్రం, ఇంకా భారత యూనియన్ యొక్క అధికారిక భాష అయిన హిందీకి గౌరవనీయమైన హోదాను నిర్ధారించే ప్రచారానికి దోహదపడిన సాహితీవేత్త. ఫిబ్రవరి 25, 2025న తన 88 సంవత్సరాల వయస్సులో మరణించిన కళానాథ శాస్త్రి కేంద్ర సాహిత్య అకాడమీ, సంస్కృత అకాడెమీ పురస్కారాలు అందుకున్న బహుళప్రచురితమైన గ్రంథ రచయిత. ఆయన ప్రపంచ ప్రఖ్యాత సాహితీవేత్త, విప్లవాత్మక సంస్కృత కవి భట్ట మధురానాథ శాస్త్రి యొక్క పెద్ద కుమారుడు. కళానాథ శాస్త్రి సంస్కృతం,హిందీ బహు భాషా రచయిత,ప్రసిద్ధ మహామహోపాధ్యాయ పురస్కార గ్రహీత కూడా. ఆయన విద్యాభ్యాసం కాశీ హిందూ విశ్వవిద్యాలయం నుండి సంస్కృత సాహిత్యంలోసాహిత్యాచార్య కోర్సును, రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుండి ఆంగ్ల సాహిత్యం లో ఎం.ఎ., పట్టాను పొంది అత్యున్నత పదవిని చేపట్టారు. జైపూర్ లో తన తండ్రితో పాటు ఉన్నత విద్యావేత్తలతో కలిసి అక్కడ సంస్కృత సాహిత్యాన్ని అభ్యసించారు. వీరిలో కొందరు పండిట్ గిరిధర్ శర్మ చతుర్వేది, పండిట్ పట్టాభిరామ శాస్త్రి, ఆచార్య జగదీష్ శర్మ, ఆశుకవి పండిట్ హరిశాస్త్రి మొదలైన వారున్నారు. ఆయన ఆంగ్ల సాహిత్యంలో ప్రొఫెసర్ గా రాజస్థాన్ విశ్వవిద్యాలయంలోని వివిధ కళాశాలలలో బోధించారు, ఇంకా అనేక కళాశాలలలో ప్రిన్సిపాల్ పదవిని కూడా నిర్వహించారు. ఆయన ఆంగ్ల సాహిత్యానికి తోడుగా వేదాలు, భారతీయ, వెస్టర్న్ తత్వశాస్త్రం, తులనాత్మక భాషాశాస్త్రాలు పూర్తిగా అధ్యయనం చేశారు. ఆయన బెంగాలీ, గుజరాతీ, తెలుగు మొదలైన భాషల లిపికి సంబంధించిన పరిశోధన చేశారు.చిన్నప్పటి నుంచీ ఆయన సంస్కృత శ్లోకాలను ఛందోబద్ధంగా అవలీలలగా వ్రాయడంలో దిట్ట. ఇక జైపూర్ లో శాస్త్రి సంస్కృతం వంటి ప్రాచీన భాషలో ఆధునిక శైలులను అట్లాగనే వ్యక్తీకరణ పద్ధతులను పరిచయం చేసే గొప్ప సంప్రదాయాన్ని కొనసాగించారు. ఆయన ఈ త్రిభాషలలోని తత్వశాస్త్రం, సాహిత్యం యొక్క స్మారక రచనల అంతర్ సాహిత్య అనువాదాలకు అలాగే ప్రాకృత, బ్రజ్ భాష, రాజస్థానీ ఇంకా ఇతర భారతీయ భాషలకు ప్రసిద్ధి చెందారు.ఆయన అందించిన సేవలు ,పొందిన సాహిత్య విజయాలలో ముఖ్యంగా కళానాథ్ శాస్త్రి భారతదేశంలోని ప్రఖ్యాత పత్రికలకు హిందీ, సంస్కృతంలో వెయ్యికి పైగా వ్యాసాలను అందించారు. సంస్కృతం, హిందీ, ఆంగ్లంలో 200 కి పైగా ప్రసంగాలు, కవితలు అలాగే నాటకాలను ప్రసారం చేశారు. ఆయన సాహిత్య చరిత్రకారుడు, విమర్శకుడు మరింకా వ్యాఖ్యాత కూడా. ఆధునిక సంస్కృత సాహిత్య చరిత్రలోఆయన ఒక కల్పిత రచయితగా ప్రసిద్ధి చెందారు, అతను తన నవలలు, చిన్న కథలు, వ్యక్తిగత వ్యాసాలు ఇంకా 20వ శతాబ్దపు సంస్కృత సాహిత్యంపై తన పుస్తకాల ద్వారా సృజనాత్మక సంస్కృత రచనలో ఆధునిక శైలిని పరిచయం చేశాడు. ఆయన 2021లోరాజస్థాన్ సంస్కృత అకాడమీ ఛైర్మన్‌గా పనిచేశారు. అట్లనే సంస్కృత విద్య, భాషా విభాగంలో 1976-1994 మధ్య కాలంలో డైరెక్టర్‌గా పదవిలో పనిచేశారు.మహారాజా సంస్కృత కళాశాల, జైపూర్ లో సంస్కృత సాహిత్యం హిందీ భాషాశాస్త్రం చదివారు.. ఆయన శాస్త్రీయ వృత్తిరంగంలో సంస్కృత భాషాశాస్త్రం,



హిందీ భారతీయ సంస్కృతి సంస్థలు, భాషల విభాగం మహారాజా కళాశాల,రాజస్థాన్ హిందీ గ్రంథ అకాడమీ ,సంస్కృత విద్యా విభాగం,కళాశాల విద్య విభాగం సికార్ ప్రభుత్వ కళాశాల, కోట్‌పుట్లి ప్రభుత్వ కళాశాల,ఇంకా జైపూర్‌లోని జెఆర్ఆర్ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆధునిక సంస్కృత ఛైర్‌కు చైర్‌పర్సన్‌గా పనిచేశారు. శాస్త్రిగారు అందుకున్న ప్రధాన గౌరవాలు అవార్డుల జాబితా సుదీర్ఘమైనది. ఆయన 'సాహిత్య మహోదధి' 'సాహిత్య శిరోమణి' మరియు సంస్కృతానికి జీవిత సాఫల్య పురస్కారం, రాజస్థాన్ ప్రభుత్వం, జైపూర్,ఉత్తరప్రదేశ్ సంస్కృత సంస్థాన్ ద్వారా సంస్కృత జర్నలిజంకు జీవిత సాఫల్య పురస్కారం,కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా సంస్కృతానికి అవార్డు , ద్వారకా సేవా నిధి ప్రజ్ఞా పురస్కార్, డి.లిట్ రాజస్థాన్ సంస్కృత విశ్వవిద్యాలయం ద్వారా విద్యా వాచస్పతి, జీవిత సాఫల్య పురస్కారం (అజీవన్ సంస్కృత సాధన సమ్మాన్, రాజస్థాన్ ప్రభుత్వం, రాజస్థాన్ సంస్కృత విశ్వవిద్యాలయం ద్వారా భారత ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వ శాఖ గౌరవాలు పొందారు. ఆయన చివరి శ్వాస వరకూ ప్రఖ్యాత సంస్కృత మాసపత్రిక భారతికి ప్రధాన సంపాదకులుగా ఉన్నారు.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

కవిత

సైలెన్స్

కళ్లముందు కనిపించే నిశ్శబ్దాన్ని
శబ్దాలకన్నా గట్టిగా వినగల చెవి కవి.
క్షణాల వెంట నడిచే కాలపాదాలను
గడియారాలకన్నా లోతుగా తూకం వేయగల హృదయం
కవి.
ముసుగుల వెనుక దాగిన మనిషి నిజాన్ని
మాటల మాయలు లేకుండానే పట్టగల
అంతరదృష్టి అతని శ్వాస.

అతని మౌనం కూడా
ఒక సమాధానం కాదు -
సమాధానాల్ని ప్రసవించే
నిశ్శబ్ద గర్భం.

కనిపించని కన్నీళ్ల చప్పుడిని,
నవ్వుల వెనుక దాగిన అలసట నడకను
అక్షరాల రూపంలో నడిపించగలవాడే కవి.

అన్నింటినీ పక్కదారినుంచి చూసే
విలక్షణ చూపే అతని ఆయుధం.
చీకటి మడతల్లోనూ వెలుగును తాకే
ఆలోచనలే అతని అడుగుల శబ్దం.

తాను మాట్లాడకపోయినా
ప్రపంచం తలవంచేలా చేసే
ఆలోచనల బరువే
అతని నిజమైన స్వరం.

సప్తసముద్రాలు దాటి వచ్చిన అనుభవాన్ని
తన హృదయ తీరానికి కట్టేసి,
మనిషి ఊహకు అందని వాస్తవాన్ని
సాధారణ మాటల ముత్యాలుగా
మన చేతుల్లో పెట్టగల శక్తి అతనిది.

అతను చెప్పేది కథ కాదు,
కథ వెనుక మిగిలిన మౌనం.
అందుకే అది పుస్తకాన్ని కాదు,
మనిషి అంతరాన్ని తాకుతుంది.

సత్యాన్ని కాలానికి అప్పగించకుండా
ఈ క్షణంలోనే పలికించగల ధైర్యం అతని స్వభావం.
బూడిదలో దాగిన నిప్పును గుర్తించే చూపు,
మౌనంలో నిద్రపోతున్న ప్రశ్నను
లేపే బాధ్యత అతని భారం.

రేపటి చైతన్యం కోసం
ఈ రోజునే తన హృదయాన్ని తరిగిస్తూ,
మనోనేత్రాన్ని
నాలుగు దిక్కులకే కాదు
భూత-వర్తమాన-భవిష్యత్తుల వైపు
ఏకకాలంలో విప్పగలవాడే కవి.

నిన్నటి గాయాలను జ్ఞాపకాలుగా,
నేటి పోరాటాన్ని అక్షరాలుగా,
రేపటి ఆశలను దీపాలుగా చేసి
మనిషి నడిచే దారిలో
నిశ్శబ్దంగా పెట్టే వాడే కవి.

కవి మాటల్ని మౌనానికి అప్పగించిన చోటే
అర్థాల ప్రయాణం మొదలవుతుంది.
అక్కడ కవిత ముగిసిందని కాదు -
మనసు ఆలోచించడం మొదలవుతుంది.

అందుకే కవి
ఒక వ్యక్తి కాదు - ఒక ప్రవాహం,
ఒక పదం కాదు - ఒక సత్యం,
ఒక శబ్దం కాదు -
కాలాన్ని దాటే కాగడా... జర్నీ.



చిటికెన కిరణ్ కుమార్
9490841284

యాది

వైద్య ప్రతిభామూర్తి ఎల్లా ప్రగడ సుబ్బారావు




సుధాకర్.ఏ.వి
9000674747

'ఈ మహనీయుని గురించి మీలో చాలామంది వినకపోవచ్చు.కానీ ఆయన ఈ లోకంలో జన్మించారు కాబట్టే మీరు ఎక్కువ కాలం జీవించగల్గుతున్నారు' అని అమెరికన్ రచయిత డోరన్ కె. యాస్ట్రమ్ అన్న మాటలు అక్షరసత్యాలు.చర్మ, కంటి, జననేంద్రియాలు, ఉదర, మూత్రకోశ వ్యాధులు.. నిమోనియా వంటి ఎన్నో జబ్బులను మానవాళి సమర్థంగా తట్టుకుంటోందంటే.. మనిషి ఆయుః ప్రమాణం పెరిగిందంటే.. కేవలం ఒక్క మహానుభావుడి పుణ్యమే! ఆయనే ఎల్లాప్రగడ సుబ్బారావు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణంలో 1895, జనవరి 12న జన్మించాడు. తండ్రి పేరు జగన్నాథం. ఎలిమెంటరీ ఉన్నత పాఠశాల చదువులు పూర్తి చేసేటప్పటికి తండ్రి చిరు ఉద్యోగిగానే రిటైర్ అయ్యాడు.ఇక ఇతనిని చదివించడానికి తండ్రి వెనుకంజ వేయగా తల్లి పట్టుబట్టి రాజమండ్రికి పంపించి మెట్రిక్యులేషన్ పరీక్ష చదివించింది. ఫెయిలయ్యాడు. ఇంతలో తండ్రి మరణించాడు. తల్లి పట్టుదలతో మద్రాసుకు పంపదల్చగా చేత చిల్లిగవ్వ లేదు. పుస్తెలు అమ్మి కొడుకు చదువుకు ఇచ్చింది.

మద్రాసు హిందూ ఉన్నత పాఠశాలలో చేరి చదువులో ముందడుగు వేశాడు. పేదరికంలో విద్యాపరమైన నైరాశ్యంతో భవిష్యత్తు పట్ల ఆత్మవిశ్వాసంతో వర్తమాన ఇబ్బందులను అధిగమించే సాహసం ఇతనికి బాల్యంలోనే అబ్బింది. సంఘ సంస్కర్త చిలకమర్తి లక్ష్మీనరసింహం ప్రభావం ఇతని మీద బాగా పొడసూపింది. మద్రాస్, మైలాపూర్ లోని రామకృష్ణ మిషన్ వైపు ఆకర్షితుడయ్యాడు. వైద్యం నేర్చి మిషన్ లో చేరి సన్యాసిగా అందరికీ వైద్య సేవలు అందించాలన్న ఆలోచనా చేశాడు.తన ఆలోచనను వివరింపగా స సేమిరా అంగీకరించలేదు. బంధువుల సహకారంతో మద్రాస్ వైద్య కళాశాల ఇంటర్మీడియట్ డిస్టెంక్షన్ లో పాసయ్యాడు.

దేశ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో విదేశీ దుస్తులను బహిష్కరించి, ఖద్దరు దుస్తులతో కాలేజీకి వెళ్లిన ఇతను కాలేజీ అధికారుల ఆగ్రహానికి గురయ్యాడు. ఇంతలో మరో దుర్ఘటన జరిగింది. అత్యంత సన్నిహితుడైన పెద్దన్నయ్య పురుషోత్తం భయంకరమైన "స్ప్రూ" వ్యాధితో మరణించాడు. ఈ బాధ నుండి కోలుకోకముందే, వారం రోజుల వ్యవధిలో మరో సోదరుడు కృష్ణమూర్తి ఇదే వ్యాధికి బలయ్యాడు. ఈ రెండు మరణాలు ఇతనిని తీవ్ర మనోవేదనకు గురిచేశాయి. ఎంత శ్రమపడి అయినా ఈ



వ్యాధికి ముందు కనుగొనాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఆర్థిక ఒత్తిడి ఎంతగా ఉన్నా, ఎన్ని అవరోధాలు ఎదురైనా చదువు కొనసాగించాలని నిశ్చయించుకున్నాడు. మద్రాసు ఇండియన్ మెడికల్ కాలేజీలో ఎల్.ఐ.ఎం. చేసి కార్పొరేషన్ ఆయుర్వేద హాస్పటల్ లో నెలకు అరవై రూపాయల జీతం మీద పనిచేశాడు. విదేశాలకు వెళ్ళీ పరిశోధనలు చేయాలని వైద్యశాస్త్రాన్ని శోధించి పరిశోధించి అనేక రహస్యాలను వెలికి తీయాలనే దృఢ కాంక్షను రోజు రోజుకీ బలపరచుకున్నాడు.

అది సహాయ నిరాకరణ ఉద్యమం సాగుతున్న వేళ! గాంధీజీ పిలుపుతో విదేశీ వస్త్ర బహిష్కరణలో పాల్గొన్నారు సుబ్బారావు. ఇందులో భాగంగా ఖద్దరుకు కట్టుబడ్డారు. ఖద్దరుతో తయారైన సర్జికల్ ఏప్రాన్ ధరించి సుబ్బారావు మెడికల్ కాలేజీకి వెళ్లారు. అక్కడి సర్జరీ విభాగం ఆచార్యుడు ఎం.సి.బ్రాడ్‌ఫీల్డ్‌కు ఇది ఆగ్రహం కల్గించింది. 'గాంధీ వైస్రాయ్ అయ్యాక దీన్ని ధరించు' అంటూ ఎద్దేవా చేశాడు. సుబ్బారావు వెంటనే ఏమాత్రం జంకకుండా.. 'వైస్రాయ్ స్థాయికి గాంధీజీ ఎన్నడూ దిగజారడు' అని ఘాటుగా బదులిచ్చారు. దీంతో బ్రాడ్‌ఫీల్డ్.. సుబ్బారావుపై కక్షగట్టాడు. ఆయనకు డాక్టర్ పట్టా ఇవ్వకుండా అంతకన్నా తక్కువదైన ఎల్ఎంఎస్ సర్టిఫికెట్ తో సరిపుచ్చారు. బ్రాడ్‌ఫీల్డ్ పుణ్యామా అని వైద్య వృత్తి పట్టా దక్కని సుబ్బారావు ఆయుర్వేదంపై దృష్టిసారించారు. దీనికి కారణం లేకపోలేదు. అంతకుముందు 'ఉష్ణమండల స్ప్రూ' వ్యాధి బారినపడ్డ తనను లక్ష్మీపతి అనే ఆయుర్వేద వైద్యుడు కాపాడారు. దీంతో మద్రాస్‌లో ఆ డాక్టర్‌కు చెందిన ఆయుర్వేద కళాశాలలో అనాటమీ లెక్చరర్‌గా చేరి ఆ రంగంలో పరిశోధనలూ సాగించారు. భారత్‌కు వచ్చిన అమెరికన్ వైద్యుడు జాన్ ఫాక్స్ కెండ్రిక్స్... సుబ్బారావులోని మేధస్సును గుర్తించారు. విదేశాలకు వెళ్లి పరిశోధనలు చేయాలని సూచించారు. అప్పట్లో పరిశోధనల కోసం ఎక్కువగా ఇంగ్లండ్‌కు వెళ్లేవారు. కానీ బ్రిటన్ అంటే విముఖతతో ఎల్లాప్రగడ అమెరికాలోని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్‌లో అడ్మిషన్‌కు దరఖాస్తు చేశారు. మెడిసిన్ డిప్లొమా కోర్సులో కెమిస్టుగా ప్రవేశం లభించింది. 1923 అక్టోబరులో సుబ్బారావు అమెరికాలో కాలుమోపారు. హార్వర్డ్‌లోనే పరిశోధనలపై దృష్టిసారించారు. పీహెచ్‌డీ సాధించారు. ఔషధ రంగంలో అద్భుత ఆవిష్కరణలు చేశారు. సుబ్బారావు సహచరుడు, 1988లో గెట్రూడ్ ఎలియాన్‌తో కలిసి వైద్య శాస్త్ర నోబెల్ బహుమతి పంచుకొన్న జార్జ్ హిచ్చింగ్స్ మాటల్లో: "ఫిస్క్, అసూయతో సుబ్బారావు పరిశోధనలను వెలుగు చూడనీయక పోవడం వలన సుబ్బారావు కనుగొనిన కొన్ని న్యూక్లియోటైడ్లను అనేక సంవత్సరాల తర్వాత ఇతర పరిశోధకులచే తిరిగి కనుగొనవలసి వచ్చింది". యల్లాప్రగడ 'కరోనరి త్రాంబసిన్' వ్యాధితో 1948 ఆగష్టు 9వ తేదిన అమెరికాలో కన్నుమూశాడు

(వ్యాసకర్త రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ)



ప్రాంతీయం

హరీశ్ రావు పై అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదు

- పామాయిల్ ఫ్యాక్టరీ కేసీఆర్ హరీశ్ రావు కృషి వల్లనే సాధ్యమైంది
- కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి
- రాగుల సారయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్



ప్రతిపక్షం,నంగునూరు జనవరి 11:

మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదని ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, నంగునూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ కోల రమేశ్ గౌడ్ , నంగునూరు సర్పంచ్ సనాదుల బాల పోచయ్య అన్నారు. ఆదివారం నంగునూరులోని బాలాజీ గార్డెన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తూ చిల్లర మాటలు మాట్లాడుతూ హరీశ్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని చెప్పారు. చిల్లర మాటలు మాట్లాడడం మానుకోక పోతే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. నర్మెటలో పామాయిల్ ఫ్యాక్టరీ మంజూరు చేసింది బీ ఆర్ ఎస్ ప్రభుత్వమన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు కృషి వల్ల కే సీ ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఈ ఫ్యాక్టరీ సాధ్యమైందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకొని వాస్తవాలు గ్రహించాలని, అవగాహన లేని వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. హరీశ్ రావు ఈ ప్రాంత ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే హోదాలో పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శిస్తే పార్టీ కార్యాలయమా అని అడగడం సరికాదన్నారు. గతంలో కాంగ్రెస్ మంత్రులు పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించి ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మాట్లాడినప్పుడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా అని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. శనివారం హరీశ్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసి,ఆయన చిత్ర చిత్రపటానికి నిప్పటించిన ఘటనలో కాంగ్రెస్ నాయకుల పైన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీ ఆర్ ఎస్ నాయకులు మహేందర్ గౌడ్, మ్యాక కనకయ్య, శ్రీధర్ గౌడ్, కోల సతీశ్ గౌడ్, రచ్చ సిద్ధు, రేకులపల్లి వెంకట్ రెడ్డి, ఉల్లి మల్లయ్య, గుడికందుల ఆనందం, దేవులపల్లి కనకయ్య, బడే రాజయ్య, యువజన నాయకులు తప్పెట పరశు రాములు, బిక్షపతి నాయక్, దేవులపల్లి రాజేందర్, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫజుల్ రహమాన్ మృతి తీరని లోటు

- జర్నలిజాన్ని సామాజిక బాధ్యతగా భావించారు
- ఫజుల్ రెహమాన్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్,జనవరి 11:

సీనియర్ జర్నలిస్టు, ప్రతిపక్షం దినపత్రిక వవస్థాపక సంపాదకులు ఫజుల్ రెహమాన్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పలు దిన పత్రికల్లో ఫజుల్ రెహమాన్ ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. జర్నలిజాన్ని ఒక వృత్తిగా కాకుండా, సమాజ బాధ్యతగా భావించిన వ్యక్తి మహమ్మద్ ఫజల్ రహమాన్ అని పేర్కొన్నారు. రచయితగా, ఉపాధ్యాయుడిగా, సంపాదకుడిగా ఆయన చేసిన సేవలు అమోఘమన్నారు. అలాంటి వ్యక్తి ఇక లేరన్న వార్త మనసును తీవ్రంగా కలిచి వేస్తోందని చెప్పారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటని చెప్పారు. తన జీవితాన్ని జర్నలిజానికి అంకితం చేసిన ఫజుల్ రెహమాన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఘనంగా గోదాకళ్యాణ మహోత్సవం

సిద్దిపేట, జనవరి 11:

ధనుర్మాసం పురస్కరించుకొని గణేష్ నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గోదాకళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం పాత వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి మహిళలు శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం సాయంత్రం మంగళస్నానాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఆశేష జనావాహిని మధ్య గోదాకళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోదా అమ్మవారిని మురళీకృష్ణుడు-రంగనాథ స్వామి రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కళ్యాణ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు, మహిళా గోష్టి సభ్యులు, గణేష్ నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు.ఆలయ అర్చకులు చిలకమర్రి వెంకటరమణ చర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

తాత, తండ్రి స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల బరిలోకి

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి11:



లక్షల రూపాయల వేతనం వదులుకొని రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తూ తాత, తండ్రి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ వస్తున్న యువ నేత ఎన్నీ సంతోష్ గుప్త వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అరంగేట్రం చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గత దశాబ్ద కాలంగా గజ్వేల్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఒక సంస్థ ద్వారా సేవలందిస్తూ వస్తుండగా, మాజీ సర్పంచ్, ఎంపీపీగా తాత దివంగత రాజయ్య గుప్త, తండ్రి తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తల స్ఫూర్తితో వారి ఆశయ సాధనకు ఎన్నికల బరిలో దిగుతున్నట్లు ప్రకటించారు. పదవులు అధికారం కోసం కాకుండా బాధ్యతగా భావించే తమ కుటుంబ లక్ష్యం పేదల సంక్షేమమని స్పష్టం చేశారు. ఇప్పటికే యువతలో మంచి క్రేజీ ఉన్న సంతోష్ గుప్త గజ్వేల్ ప్రజలకు చిరపరిచితుడు కాగా, పేదల కష్టసుఖాలు, శుభ, అశుభ కార్యాలలో తన వంతు సహకారం అందిస్తూ ప్రజల మన్ననలు, ప్రేమానురాగాలు పొందుతున్న ఆయనకు చక్కటి భవిష్యత్తు ఉందని పలువురు స్పష్టం చేస్తుండగా, ఇప్పటికే గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని వార్డులపై అవగాహన ఉన్నట్లు చెప్పారు. గత ఐదేళ్ల కాలంలో తన తండ్రి రాజమౌళి గుప్తకు సంపూర్ణ సహకారం అందిస్తూ వార్డులలో మౌలిక వసతులు, త్రాగునీరు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారంలో ముందుండగా, వ్యక్తిగత పథకాలను వర్తింపజేసి పేదలకు చేరువైనట్లు సంతోష్ గుప్త పేర్కొన్నారు.

పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి చేతుల మీదుగా నవోదయ విద్యార్థులకు బహుమతులు..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 11:

సిద్దిపేట్ జిల్లా వర్గల్ మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఈ నెల 15న న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో జరిగే కార్యక్రమంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవల్ చేతుల మీదుగా బహుమతులు స్వీకరించనున్నారు. ఈ విషయాన్ని విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు.గత ఏడాది ఫిబ్రవరిలో మహారాష్ట్ర నాగపూర్‌లో నిర్వహించిన 26వ జాతీయ యువ పార్లమెంట్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గాను ఈ విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 13న విద్యార్థులు ప్రిన్సిపల్ దాసి రాజేందర్, అధ్యాపకులు జి.ఎస్.ఆర్. భాస్కర్, సుసాన్ జాన్‌ల నేతృత్వంలో న్యూఢిల్లీకి బయలుదేరనున్నారు.ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో గడ్డి మందు తాగి రైతు ఆత్మహత్య

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 11



సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం గణపురం గ్రామంలో అప్పుల బాధ భరించ ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం చనిపోయాడు. ఈ ఘటనలో ఘనపురం గ్రామానికి గ్రామానికి చెందిన ఎల్ల రాజిరెడ్డి(50) అనే రైతు గడ్డి మందు తాగి మృతి చెందాడు. రాజగోపాలపేట ఎస్సై టి.వివేక్ కథనం ప్రకారం ఘనపురం గ్రామంలో రాజిరెడ్డి వ్యవసాయంతో పాటు, పశువుల(ఎడ్ల) వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. చాలా రోజుల నుండి చేస్తున్న ఎడ్ల వ్యాపారంలో నష్టము వచ్చింది. తనకు ఉన్న రెండు ఎకరాల భూమిలో రెండు బోర్లు వేశాడు. దీంతో దాదాపు రూ.5 లక్షల అప్పు అయ్యింది. ఈ అప్పులను తీర్చే మార్గం లేక బాధతో శనివారం ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరు లేని సమయంలో పరక్వాట్ అనే గడ్డి మందు తాగాడు. గమనించిన ఇంటి పక్క వారు నంగునూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రికి అక్కడి నుంచి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 5.35 గంటలకు మరణించాడు. రాజిరెడ్డి భార్య ఎల్ల మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.వివేక్ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయి
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 11

మెదక్ జిల్లా పరిధిలో పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నియంత్రించేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలు శాంతిభద్రతలకు భంగం కలిగించడమే కాకుండా యువతను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందన్నారు అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నిరంతర వాహన తనిఖీలు, రాత్రి-పగలు గస్తీ ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. పేకాట, కోడిపందాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.అలాగే ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి గురించి సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా డయల్ 100 ద్వారా గానీ పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ ప్రజలను కోరారు. ప్రజలు అందించే సమాచారం ఆధారంగా తక్షణమే చర్యలు చేపడతామని,సమాచారం ఇచ్చిన వారి పేర్లు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ హామీ ఇచ్చారు.శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో కీలకమని,చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

- అఖిలభారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 11:

సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ధర్మస్థాపన ద్వారానే లోకం సుభిక్షంగా ఉంటుందని అఖిలభారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో దుర్గాప్రసాద్ స్వామీజీ మీడియాతో మాట్లాడారు. లోకకళ్యాణార్థం సమాజం సుభిక్షంగా ఉండాలని సదుద్దేశంతో కోటి హనుమాన్ చాలీసా పారాయణం సంకల్పం చేస్తే అద్భుతంగా జరిగిందని గుర్తు చేశారు. అలాగే ఈ సంవత్సరం కూడా కోటి హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా విజయవాడలో హనుమాన్ దేవాలయ పున ప్రతిష్ట జరుగుతుందని, హనుమాన్ జయంతి లోపు ఈ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమ సంకల్పం కోసం హనుమాన్ వైభవం అందరికీ తెలిసేలా స్వామివారి అనుగ్రహం అందరికీ అందాలనే సత్సంకల్పంతో 108 గ్రామాల సందర్శన చేయనున్నట్లు చెప్పారు. అలాగే రెండు రాష్ట్రాలలో ఉన్న హనుమాన్ దీక్ష కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటివరకు సిద్దిపేట పట్టణానికి చెందిన నేతి కైలాసం, గ్యాదరి పరమేశ్వర్ లకు కార్యక్రమ బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. ఈనెల 25 రథసప్తమి రోజున కండ్లకోయ ఆశ్రమంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి 108 గ్రామాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. రథసప్తమి రోజు ఆశ్రమంలో జరిగే ఈ బృహత్ కార్యక్రమంలో ప్రతి ఒక్క హిందువు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రామకృష్ణ, హనుమాన్ దీక్ష కమిటీ నాయకులు కైలాసం, పరమేశ్వర్, రమేష్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.



మెదక్ మున్సిపాలిటీ

ఓటర్ జాబితా పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 11:

మెదక్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా సందర్శించి ఓటర్ జాబితాను పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ ఏ సమయంలోనైనా విడుదల కావచ్చని దానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్ జాబితా తయారీలో ఎన్నికల నిబంధనలను పాటించినట్లు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సమస్యలకు తావు లేకుండా విధులు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, మేనేజర్ భవాని, ప్రభాకర్ సంబంధిత మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

తొమ్మిది నెలలుగా అందని వేతనాలు

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గోడు..
- భట్టి విక్రమార్క స్పందించాలి
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు



ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 11:

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కి లేఖ రాశారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రిలో జి.ఓ నెం.2246 కింద 97 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గత ఏడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. వీరిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ అటెండెంట్లు, ఎక్స్‌రే టెక్నీషియన్లు, ఆఫీస్ సబార్డినేట్లు, వార్డు బాయ్ లు, స్వీపర్లు, ధోబీలు ఉన్నారని తెలిపారు. అత్యవసర వైద్య సేవల్లో నిరంతరం అందుబాటులో ఉంటూ నిరుపేద రోగులకు సేవలందించడంలో వీరి పాత్ర కీలకమని చెప్పారు. రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు వీరివని హరీశ్ రావు పేర్కొన్నారు. నెలవారీ వేతనం అందితేనే కుటుంబాలు బతుకుతాయని, లేకపోతే అప్పుల పాలవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అత్యంత కీలకమైన వైద్యశాఖలో పనిచేస్తున్న ఈ ఉద్యోగులకు తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ అంశాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. బతుకమ్మ, దసరా, దీపావళి వంటి పండుగలకు వేతనాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. కనీసం కొత్త సంవత్సరంలో, సంక్రాంతి పండుగ సందర్భంగా అయినా తొమ్మిది నెలల పెండింగ్ వేతనాలు మంజూరు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హంగులు, ఆర్భాటాలు, అనవసర కార్యక్రమాలపై నిధులు ఖర్చు చేయడం మానుకుని చిరుద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. తక్షణమే వేతనాల మంజూరుకు ఆమోదం తెలపాలని భట్టి విక్రమార్కకు లేఖ ద్వారా హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ రహిత భావి భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం మిడిదొడ్డి జనవరి 11



ప్లాస్టిక్ రహిత భావిభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మండపంలో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్, స్టవ్ లను ఇండియన్ గ్యాస్ మేనేజర్ సోమయ్య, స్థానిక సర్పంచి మహేశ్వరి దేవరాజు తో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలుష్య కారకాలైన ప్లాస్టిక్ తో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. భూమి తన ఉనికిని కోల్పోయి కాలుష్య సహిత పంటలతో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కంకణ బద్ధులు కావాలన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దశలవారీగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి విన్నపం మేరకు కళ్యాణ మండప నిర్మాణానికి తనవంతుగా రూ.5 లక్షలు మంజూరు చేశారు. అత్యవసర సమయంలో మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం ప్రత్యేకంగా తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన అంబులెన్స్ మిరుదొడ్డికి మంజూరు చేశారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలన్నారు. మిరుదొడ్డి, చేగుంట మండలాలలో డిగ్రీ కాలేజీ మంజూరుకు విద్యా శాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మండలాల పునర్విభజనలో భాగంగా మిరుదొడ్డి అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. వెనుకబడిన మండలానికి పూర్వవైభవం తేవడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు రమేష్, శ్రీనివాస్, యాదగిరి, అమర్, ఉప సర్పంచి కరుణాకర్, భాజపా జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్, భాజపా, భారాస, కాంగ్రెస్ పార్టీల మండల అధ్యక్షులు అమర్, అంజిరెడ్డి, రాజేశం, సీతారామచంద్రస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, భాజపా జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, మల్లేశం, బిక్షపతి, నాయకులు భూమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు,క్రీడాకారులను ప్రోత్సహిస్తా

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, కరీంనగర్



క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తారని మానకొండూర్ ఎమ్మెల్యే , కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ వెల్లడించారు.బెజ్జంకి మండల కేంద్రంలో ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడల వల్ల దేహ దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి అలబడుతుందన్నారు. ముఖ్యంగా గెలుపు కోసం వ్యూహాలను రచించడం అలవడుతుందని, ఈ అలవాటే జీవితంలో ఎదగడానికి దోహదపడుతుందన్నారు. ఈరోజు విద్యార్థులు, యువకులు సెల్ ఫోన్లు పట్టుకొని వాట్సప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ లలో చాట్ చేస్తూ రోజుకు కనీసం మూడు, నాలుగు గంటల సమయాన్ని వృధా చేసుకుంటున్నారని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. చాటింగ్ ల జోలికి వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు క్రీడలపై మక్కువ పెంచేలా కృషి చేయాలని ఆయన కోరారు. 40 ఏళ్లుగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. క్రికెట్ లో ఇంకా మంచి తర్ఫీదు పొంది రంజి స్థాయికి ఎదగాలని, ఈ దిశగా యువకులు సాధన చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డా.కవ్వంపల్లి అనురాధ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి , టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



భారత్ తో ట్రేడ్ డీల్ ఆలస్యం కావడానికి మోడీ ఫోన్ చేయకపోవడమే కారణమని యూఎస్ వాణిజ్య కార్యదర్శి లుక్నిక్ చేసిన వ్యాఖ్యలు సరికాదు. దేశంపై ప్రజలు నమ్మకం ఉంచాలి. మీ దేశాన్ని, మాతృభూమిని విశ్వసించండి. విదేశీయుల ప్రకటనలను కాదు. ట్రేడ్ డీల్ చిక్కుల గురించి మీడియా ముందు మాట్లాడుకోరు. రహస్యంగానే చర్చిస్తారు.

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ప్రాంతీయం



సిద్దిపేట జిల్లాను రద్దు చేసే కుట్ర మానుకోవాలి..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 11:

జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాలను రేవంత్ ప్రభుత్వం రద్దు చేయాలని కుట్రలకు తెరలేపుతుందని బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, సిద్దిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం కోసం కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల ఆకాంక్ష మేరకు కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో సిద్దిపేట జిల్లాను రద్దు చేయాలని చూస్తుందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా సిద్దిపేట జిల్లా నుండి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని వేరు చేస్తామనడం వెనక సిద్దిపేట జిల్లా రద్దు అనే కుట్ర దాగి ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండి సిద్దిపేట జిల్లా ఏర్పాటుకు పోరాటాలు జరిగాయని,అయినప్పటికిని ఉమ్మడి రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ఏర్పాటు సాధ్యం కాలేదు అన్నారు. సిద్దిపేట జిల్లా ప్రజల సౌకర్యార్థమే కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లా ఏర్పాటు చేసుకొని సమీకృత కలెక్టర్ కార్యాలయం గత ప్రభుత్వం నిర్మించింది అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ పేరును లేకుండా చేస్తామని ప్రకటించిన విధంగా ఆయన ప్రవేశపెట్టిన పథకాలను నీరుగారుస్తూ జిల్లాలను రద్దుచేసే యోచనలో రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి సిద్దిపేట జిల్లాపై కుట్రలు చేసి జిల్లాను రద్దుచేసి ఆలోచన ఉంటే ఇప్పటికైనా దాన్ని మానుకోవాలని లేనిపక్షంలో జిల్లా ప్రజల చేతిలో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని హెచ్చరించారు. ప్రజల దృష్టి మరలించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి వాటికి తెర లేపుతుందన్నారు. సిద్దిపేట జిల్లా రద్దు పై ప్రజల లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేయాల్సిన అవసరం అధికార పార్టీ నాయకులపై ఉందన్నారు. జిల్లా రద్దు విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం కానీ, మంత్రులు గాని స్పష్టమైన ప్రకటన చేయాలని లేకుంటే కాంగ్రెస్ నాయకులను జిల్లాలో తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు కాముని శ్రీనివాస్, ఎడ్ల సోమిరెడ్డి, మోహన్ లాల్, బాలకృష్ణారెడ్డి, రవీందర్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి నిజాయితీ కలిగిన మోసగాడు

- అందుకే అన్ని వర్గాలను మోసం చేస్తున్నాడు
- రాష్ట్రంలోని నిరుద్యోగుల ఆందోళన పైన దృష్టి సారించాలి
- నిరుద్యోగ యువతీ యువకులను పిలిచి ప్రభుత్వం భరోసా ఇవ్వాలి
- వెంటనే ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 11:



రేవంత్ రెడ్డి నిజాయితీ కలిగిన మోసగాడు అని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆనాటి వెనుకటి రోజులు తెస్తానని...మోసం చేసేవారికే ప్రజలు అధికారం కట్టబెడతారని ముందే చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు సరిగ్గా తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి ఆనాడు రెట్టింపు పెన్షన్లు, రైతుబంధు, దళిత బంధు, రెండు లక్షల ఉద్యోగాలు , PRC ఇలా అనేక కార్యక్రమాలను ప్రకటించి ఒక్కదాన్ని అమలు చేయకుండా విజయవంతంగా తెలంగాణ ప్రజలను 24 నెలలుగా మోసం చేస్తున్నారన్నారు. తాజాగా నిరుద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తున్నారని, వారు చేస్తున్న ఆందోళనను గౌరవించి వారిని పిలుచుకొని, ఉద్యోగాలు ఇస్తామని భరోసా ఇవ్వాలన్నారు కేటీఆర్. నిరుద్యోగులకు విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెంటనే ఇవ్వాలని, తూతూ మంత్రంగా కేవలం మీడియా హెడ్లైన్ల కోసం ఇచ్చిన జాబ్ క్యాలెండర్ పైన దృష్టి సారించి దాన్ని అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరుసగా దిల్సుఖ్నగర్ ఆర్టీసీ క్రాస్ రోడ్ తోపాటు అనేకచోట్ల విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలను పట్టించుకోవాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు అన్న విషయం ఆర్టీసీ క్రాస్ రోడ్ లో బట్టల షాపు ప్రారంభోత్సవానికి పోయిన రేవంత్ రెడ్డి పక్కనే గతంలో రాహుల్ గాంధీ నిరుద్యోగులతో సమావేశమైన గాంధీనగర్ కి పోలేక పోయిండు అని కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి అవి మావయ్య అని రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని... కానీ ఆ అబద్ధాలు ఎక్కువ రోజులు నడవవు అని కేటీఆర్ ఉన్నారు. రేవంత్ రెడ్డి రైతులను రైతు కూలీలను కౌలుదారులను విద్యార్థులను మహిళలను వృద్ధులను ప్రభుత్వ ఉద్యోగులను ఇలా అందరిని మోసం చేశారని కేటీఆర్ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయమని అడిగితే...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తట్టుకోలేకపోతున్నరన్నారు. ఆయా వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే రేవంత్ రెడ్డి తనకు తెలిసిన భాషలో మాట్లాడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డికి తెలుగు హిందీ ఉర్దూ ఇంగ్లీష్ భాషలు రావు కానీ ఆయనకు వచ్చిన ఏకైక భాష బూతుల భాష అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. హామీలను అమలు చేయమన్నందుకు ప్రతిపక్షాలను ప్రజలను ప్రతి ఒక్కరిని బూతులతో తిడుతున్నారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయమని అడిగితే... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తట్టుకోలేకపోతున్నారు రాష్ట్రంలో ఈరోజు కేసీఆర్ గారు కనిపిస్తే ధైర్యం వస్తది అని ప్రజలు అనుకుంటున్నారు అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ 24 నెలల వైఫల్య పాలనలో...గత ప్రభుత్వం కేసీఆర్ గారి ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. రాష్ట్రంలో ఎవరి దగ్గర డబ్బులు లేకుండా పరిస్థితులు దిగజారిపోయాయి...వ్యాపారాలు తగ్గిపోయాయి.. ఉపాధి దొరకకుండా పోయింది. దీనికి సన్నాసి రేవంత్ రెడ్డి ప్రభుత్వమే కారణమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కేసీఆర్ గారు అత్యంత నిష్ఠతో పనిచేశారు. నగరంలో పది సంవత్సరాలలో మన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం ఉన్నది. పది సంవత్సరాల కింద హైదరాబాదులో ఉన్న కరెంటు కోతలు, తాగునీటి తిప్పలు, అస్తవ్యస్తపు రోడ్లను హైదరాబాద్ నగర ప్రజలు చూసినారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ తో పాటు హైదరాబాద్ మరియు ఇతర పట్టణాల్లో విస్తృతమైన తాగునీటి ప్రాజెక్టులతో తాగునీటి సమస్యలు 90% కి పైగా పరిష్కరించాము. కరోనా సమయంలోను హైదరాబాద్ అభివృద్ధి కోసం తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేశాము అని తెలిపారు. పార్టీ మారి కాంగ్రెస్లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నదని, నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మని చెప్పుకుంటూ, స్పీకర్ దగ్గర మాత్రం బిఆర్ఎస్ పార్టీ అంటున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఏమి అభివృద్ధి చూసి కాంగ్రెస్లో చేరిండో నియోజకవర్గ ప్రజలకు చెప్పాలి. రాజేంద్రనగర్ కి వచ్చే ఏర్పాటు మెట్రో ఎక్స్ప్రెస్ వేను రద్దు చేసినందుకు సీఎంతోని కలిసి పోయిండా అనే విషయం చెప్పాలి అని కేటీఆర్ అన్నారు. ఈ రోజు తెలంగాణ భవన్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం వారి అనుచరులు ఈరోజు కేటీఆర్ గారి సమక్షంలో భారత రాష్ట్రసమితిలో చేరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి పార్టీ సీనియర్ నేత కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

కన్నుల పండుగగా సంక్రాంతి ముగ్గుల పోటీలు..

- ముగ్గుల సంబరాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సు
- మహిళలకు బహుమతులు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 11:



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సిద్దిపేట పట్టణం 24వ వార్డులో మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అంబరాన్ని తాకిన సంబరాలతో ఘనంగా జరిగాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే వార్డులో మహిళలు వేసిన అందమైన ముగ్గులను జెడ్పీ మాజీ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు తో కలిసి మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సు స్వయంగా ముగ్గులు వేసి మహిళలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ అంటే మహిళలకు గుర్తుకు వచ్చేది ముగ్గులు, పిండి వంటలేనని అన్నారు. భోగి పండుగ అందరికీ భోగభాగ్యాలు ప్రసాదించాలని, కనుమ పండుగ కనువిందుగా జరగాలని, సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో నిత్యం కాంతులు విరజిమ్మాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభం చేకూరాలని, ఈ పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వార్డులో అందమైన ముగ్గులు వేసిన మహిళలకు, అలాగే కార్యక్రమంలో పాల్గొన్న 250 మంది మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడవేరుగు సాయికుమార్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ లక్ష్మీ రోడ్డు భద్రతలు, సోషల్ మీడియా పట్ల తీసుకోవాల్సిన బాధ్యతలను ప్రతిబింబిస్తూ వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ ముగ్గులు వేసిన మహిళలకు మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సు ప్రత్యేక బహుమతులు అందజేశారు.



వడ్డే ఓబన్న స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రతిపక్షం సిద్దిపేట, టౌన్, జనవరి 11:

వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆదివారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్లోని మీటింగ్ హాలులో వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ హాజరై వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైరా నరసింహారెడ్డి రేనాటి పలనాటి సైరా నరసింహారెడ్డి అనుచరుడిగా ఉంటూ భారతదేశానికి స్వాతంత్రం కోసం జరిగిన పోరాటంలో వడ్డే ఓబన్న చూపిన చొరవ అంకితభావం పోరాటం అందరికీ ఆదర్శప్రాయమని వడ్డే ఓబన్న ఆశయాలు ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం మన మీద ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి సయ్యద్ రఫీ, వడ్డెర కుల సంఘం నాయకులు,వివిధ బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ కౌన్సిలర్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 11:



తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ కౌన్సిలర్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు, సిరిసిల్ల శాసనసభ్యుడు కల్వకుంట తారక రామారావు హాజరై క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ కంట్రోల్ కౌన్సిలర్లు తమకు ఎదురవుతున్న ఉద్యోగ సంబంధిత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కల్వకుంట తారక రామారావు, సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బొద్దిరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాముని రాజేశ్వర్తో పాటు మాజీ షెడ్యూల్డ్ కులాలు-షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు విద్యాసాగర్, మాజీ వెనుకబడిన తరగతుల కమిషన్ సభ్యుడు కోటి కిషోర్, పార్టీ నాయకులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఎయిడ్స్ కంట్రోల్ కౌన్సిలర్ల ఐక్యతను చాటింది.

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

- సిఐటియు జిల్లా నాయకులు మల్లేశం

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 11:



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 19 తలపెట్టిన పోరు యాత్రలో భాగంగా వారు ప్రచార రథం యాత్రను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనుల పేరుతో వ్యవసాయ కూలీల పొట్టలు కొడుతుందని మల్లేశం విమర్శించారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులను పగడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ధనిక వర్గాల కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మిక సంఘాలు తగిన గుణపాఠం చెప్తాయని మల్లేశం హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘాలు కార్మిక కర్షక సంఘాలు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈనెల 19 తలపెట్టిన పోరుబాట సభల పై కేంద్రం స్పందించని యెడల భారత కమ్యూనిస్టు పార్టీ మరో ఉద్యమాన్ని చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు బాలమణి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జన సేవాదళ్ శిక్షణ తరగతుల్లో చేర్యాల ప్రాంత నాయకులు

ప్రతిపక్షం చేర్యాల, జనవరి 11 :



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరుగుతున్న సిపిఐ జనసేవా దళ్ శిక్షణ తరగతులకు చేర్యాల ప్రాంత నాయకులు హాజరై శిక్షణ పొందుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ "భారత గడ్డపై వందేళ్లు" పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాల ముగింపు సభ ఈనెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారని, రాష్ట్రం నుండి 5 లక్షల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు పాల్గొనున్నట్లు తెలిపారు. యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, మానసిక పరివర్తన అవసరమని అన్నారు. జన సేవా దళ్ ప్రజలకు రక్షణగా ఉంటుందని విపత్కర పరిస్థితిలో పేద ప్రజలకు అండగా ఉంటూ ఎంతో ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



"

యేటా వృథాగా సముద్రంలో కలుస్తున్న 3వేల టీఎంసీల గోదావరి నీటిలో 200 టీఎంసీలు వాడుకుంటే తప్పేంటి. తోటి తెలుగు రాష్ట్రానికి స్నేహహస్తం అందిస్తుంటే, వారు ఏపీకి అన్యాయం జరిగేలా కోర్టుకి వెళ్లడం విచారకరం. నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం కోర్టులో విచారణ సందర్భంగా బలమైన వాదనలు వినిపించాలని అధికారులు, లాయర్లకు సూచించాం.

- నిమ్మల రామానాయుడు, ఏపీ మంత్రి

బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేత

ప్రతిపక్షం మొయినాబాద్ జనవరి 11



శంషాబాద్ నుండి వెంకటాపూర్ శ్రీరామ్ నగర్ సురంగల్ మొయినాబాద్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి అన్నారు శనివారం మండల పరిధిలో వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ అర్జున్ రెడ్డి మాజీ ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి ఉపసర్పంచ్ రబ్బులు రాజేందర్ నగర్ డిపో మేనేజర్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యం బస్సులు నడిపించాలని కోరారు ప్రజలకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయపాలనలో బస్సులు నడిపించాలని వివరించారు అనంతరం డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారు బస్సులను నడిపిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తేళ్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కూకట్ పల్లి, ప్రతిపక్షం,జనవరి 11



వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్ క్లేవ్ లో ఆర్.ఎన్.సి హాస్పిటల్ డాక్టర్ రమేష్ సౌజన్యంతో తేళ్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వడ్డేపల్లి ఎన్ క్లేవ్ కార్యదర్శి డాక్టర్ సంతోష్ కుమార్, పీఎస్ఆర్కే భగవాన్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా తేళ్ల హరికృష్ణ మాట్లాడుతూ.. రోజువారి జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు తమ వంతు కృషిగా తెల్ల హరికృష్ణ, దాసరి రాహుల్ ప్రదీప్ మిత్ర మండలి గత ఆరు నెలలుగా హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీ డివిజన్లో పలుచోట్ల బ్లడ్ డొనేషన్ క్యాంప్, హై టెస్టింగ్ క్యాంప్, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది ఐదవ క్యాంప్ నిర్వహిస్తున్న వైద్య శిబిరమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, జీఆర్బీఎస్, సీబీపీ, ఈసీజీ పరీక్షలతో పాటు డాక్టర్ కన్సల్టేషన్ మరియు ఉచిత మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మందికి పైగా కాలనీవాసులు పాల్గొని వైద్య సేవలను ఉపయోగించుకున్నారని తెలియజేశారు, కార్యక్రమంలో పాల్గొన్న హాస్పిటల్స్ సిబ్బందికి డాక్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అందరి చూపు రిజర్వేషన్ వైపు


- నలుగురు కలిస్తే అదే చర్చ
- ఎక్కడ చూసినా బల్దియా పై చర్చ నే

బొందుగుల నాగరాజు
ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 11:-

మెదక్ మున్సిపల్ చరిత్రలో గతంలో ఎప్పుడు జరగని చర్చ నేడు జరుగుతోంది. మున్సిపల్ చైర్మన్ పదవితో పాటు 32 మంది కౌన్సిలర్ పదవులకు రిజర్వేషన్ అనుకూలిస్తుందా లేదా తమ భవిష్యత్తు ఏంటి అనే చర్చ సాగుతోంది. 1952లో మున్సిపల్ ఏర్పడినప్పటి నుండి రిజర్వేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు యువత ముందుకు వస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్లు ఎలా ఉంటాయి అనే చర్చ నడుస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం మెదక్ మున్సిపాలిటీలో ఓటర్ల సంఖ్య 37,045. మెదక్ మున్సిపాలిటీని 32 వార్డులుగా విభజించారు. గత మున్సిపల్ ఎన్నికలలో 11 వార్డు బిసి సామాజిక వర్గానికి 16 వార్డు ఓసి సామాజిక వర్గానికి నాలుగు వార్డులు ఎస్సీ సామాజిక వర్గానికి, ఒక వార్డు ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించారు. చైర్మన్ పదవిని ఓసి సామాజిక వర్గానికి కేటాయించారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ లో కౌన్సిలర్ గా అవకాశం వస్తుందా లేదా అనే కోణం నుండి ఆశావాదులు ఆలోచిస్తున్నారు వార్డులలో రిజర్వేషన్ అనుకూలిస్తుందా లేదా అనే చర్చ కొనసాగుతుంది. నలుగురు కలిస్తే మున్సిపల్ రిజర్వేషన్ వైపే చర్చ కొనసాగుతుంది రిజర్వేషన్ ఎలా కలసి వస్తుందా లేదా అనే ఆలోచనతో ఆశావాదులు ఎదురు చూస్తున్నారు. మెదక్ మున్సిపాలిటీ ఏడు దశాబ్దాల క్రితం ఏర్పడ్డది . నాటి నుండి నేటి వరకు ఎస్సీ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి దక్కకపోవడంతో దళిత సంఘాల నాయకులు ప్రజాస్వామ్యవాదులు అసంతృప్తితో ఉన్నారు ఏడు దశాబ్దాల నుండి ఓసి జనరల్ బిసి రిజర్వేషన్ అయిన తప్ప ఎస్సీ సామాజిక వర్గానికి చైర్మన్ దక్కకపోవడం ఏమిటని దళిత సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా మెదక్ మున్సిపల్ దళిత సామాజిక వర్గానికి కేటాయించాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ మున్సిపల్ 32 వార్డులలో నేడు యువత చాలా మేరకు పోటీకి సిద్ధమయ్యారు రిజర్వేషన్లు అనుకూలిస్తే ఒక్కొక్క వార్డు నుండి నలుగురు పోటీలో నిలబడుతున్నట్లు వారికి రాజకీయ పార్టీలు టికెట్ ఇస్తుందా లేదా ఇండిపెండెంట్ గా పోటీ చేస్తారా అనేది చర్చ కొనసాగుతుంది వార్డులలో కుల సంఘాల నాయకులను. వార్డులలో పెద్దలను కలిసి మేము నిలబడుతున్న మాకు సపోర్ట్ చేయండి అని ఇప్పటికే ప్రచారాన్ని కొనసాగించారు. రిజర్వేషన్లు ఖరారు ఎప్పుడూ అనేది చర్చ కొనసాగుతున్నప్పటికీ వార్డులలో రిజర్వేషన్లు అనుకూలిస్తే మాత్రం భారీ సంఖ్యలో యువత పోటీ సిద్ధమవుతోంది.

ప్రధాన రాజకీయ పార్టీలు యువకుల వైపే

గత గ్రామపంచాయతీ ఎన్నికలలో దృష్టిలో పెట్టుకొని గ్రామ పంచాయతీలలో యువకులు పెద్ద సంఖ్యలో పోటీ చేసి సర్పంచులుగా గ్రామపంచాయతీ వార్డులుగా గెలవడంపై అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్. భారత రాష్ట్ర సమితి. బిజెపి. ఎంఐఎం బీఎస్పీ వివిధ పార్టీలు యువతను రాజకీయాల్లో ప్రోత్సహించాలని ఉద్దేశంతో యువతకు ప్రాధాన్యత ఇస్తూ రాజకీయాలలో ఆసక్తి గల యువత కోసం ఎదురుచూస్తూ వారికే టికెట్ కేటాయించాలని చర్చ కొనసాగుతుంది ఇప్పటినుండే యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వార్డులలో తిరగాలని వారికి పరోక్షంగా నాయకులు కలిసి చెప్పడం గమనార్హం. బిజెపి పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసి పోటీ చేసే అభ్యర్థులతో మెదక్ ఎంపీ రఘునందన్ రావు వారికి దిశ నిర్దేశం చేశారు. హోటల్ నిలబడే అభ్యర్థులు వార్డులలో తిరగాలని ఎవరికీ అనుకూలంగా రిజర్వేషన్లు వస్తే వారిని కేటాయించడం జరుగుతుందని అందుకోసం ఇప్పటినుండే వార్డులలో ఉండే సమస్యలపై దృష్టిసారించే ప్రజలను ఆకట్టుకునే విధంగా ఉండాలని వారికి బిజెపి ఎంపీ రఘునందన్ రావు దిశ నిర్దేశం చేశారు త్వరలో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు సైతం మున్సిపల్ ఎన్నికల సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం



యువత రాజకీయాలలోకి రావాలి మెదక్ సిటిజన్ ఫోరం

యువత రాజకీయాల్లోకి రావాలని అవినీతి రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసం యువత ముందుండాలని ఏ రాజకీయ పార్టీలైన యువతను ప్రోత్సహించే విధంగా వారికి చేయూతనివ్వాలని. రాజకీయాలంటేనే మద్యం డబ్బు తో ముడిపడి ఉన్న ఈ పరిస్థితులలో యువతను ప్రోత్సహించి వాటికి దూరంగా ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని యువతకు కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదని మెదక్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో డబ్బులకు మద్యానికి ప్రాధాన్యతనిచ్చిన ఓటర్లు. అక్కడక్కడ ఓటర్లు వద్దు అంటే కూడా నిలబడ్డ అభ్యర్థులు ప్రోత్సహించడం జరిగిందని వీటికి దూరంగా ఉండాలంటే యువతను ముందు ఉండి మద్యానికి డబ్బులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజలకు సేవ చేసే నాయకున్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఓటర్ పై ఉంటుందని అది ప్రజలు ఎప్పుడైతే ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచన చేస్తారో ఆ ఆలోచననే మద్యం డబ్బులకు దూరమై ప్రజాస్వామ్యబద్ధంగా తను అనుకున్న వారికి ఓటు వేయడం జరుగుతుందని ఆ రోజుల్లో కోసం అందరూ ప్రయత్నం చేయాలని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచే ఎన్నుకోబడిన లీడర్ను ఎన్నుకున్న రోజే నిజమైన ప్రజాస్వామ్యంగా నిలబడుతుందని ఆయన తెలిపారు..

క్యూబాకు ట్రంప్ హెచ్చరిక

క్యూబా లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అనేక సంవత్సరాలుగా ఆ దేశం డబ్బు, చమురు కోసం వెనెజువెలా పై ఆధారపడిందని పేర్కొన్నారు. ఇకపై ఆ దేశానికి ఎలాంటి చమురు గానీ, డబ్బు గానీ వెళ్లవని.. పరిస్థితి చేయి దాటిపోకముందే ఒక ఒప్పందానికి రావాలన్నారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. మరోవైపు.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో.. క్యూబా అధ్యక్షుడు అవుతారంటూ ఓ నెటిజన్ పెట్టిన ట్వీట్ పైనా స్పందించారు. ఇది వినడానికి బాగుందన్నారు.''వెనెజువెలా నుంచి పెద్దమొత్తంలో అందిన చమురు, డబ్బుపై ఆధారపడి క్యూబా అనేక సంవత్సరాలు గడిపింది. దానికి ప్రతిఫలంగా.. ఇద్దరు వెనెజువెలా నియంతలకు భద్రతా సేవలు అందించింది. కానీ.. ఇకపై అలా జరగదు. ఇటీవల మేం నిర్వహించిన దాడిలో అనేక మంది క్యూబన్ భద్రతాధికారులు చనిపోయారు. వెనెజువెలాకు ఇకపై గూండాలు, దోపిడీదారుల రక్షణ అవసరం లేదు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యం వారికి అండగా ఉంది. క్యూబాకు చమురు, డబ్బులు కూడా అందవు. పరిస్థితి చేయి దాటిపోకముందే ఆ దేశం ఒక ఒప్పందానికి రావాలి'' అని ట్రంప్ స్పష్టం చేశారు. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను బంధించి తీసుకొచ్చేందుకు అమెరికా చేపట్టిన ఆపరేషన్ సమయంలో క్యూబాకు చెందిన 32 మంది భద్రతాధికారులు మృతి చెందారు. ఈ దాడిని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియజ్ కెనల్ ఖండించారు. హవానాలోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట వేలాది మంది పాల్గొన్న ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. క్యూబా చమురు అవసరాల్లో దాదాపు 30 శాతం వెనెజువెలా సరఫరా చేస్తుంది. ఇప్పటికే అస్థిరంగా ఉన్న క్యూబా విద్యుత్ వ్యవస్థ, ఇంధన సరఫరాలకు తాజా పరిణామం పెద్ద దెబ్బ అని విశ్లేషకులు భావిస్తున్నారు.



విశ్వ వీక్షణం



నిరసనకారులకు ఇరాన్ అధ్యక్షుడి హెచ్చరిక

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇరాన్‌లో ప్రజాగ్రహం తీవ్రరూపం దాల్చింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు వంద మందికిపైగా మృతి చెందారు. ఈ క్రమంలోనే దేశాధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అల్లరి మూకలు మొత్తం సమాజాన్నే నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. నిరసనకారుల వాదనలు వినేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ''ప్రజల్లో ఆందోళన నెలకొన్న విషయం వాస్తవమే. మేం వారితో మాట్లాడాలి. వారి సమస్యలను పరిష్కరించడం మా కర్తవ్యం. కానీ, అంతకంటే ముఖ్యమైన పని ఏంటంటే.. అల్లరి మూకలు మొత్తం సమాజాన్ని నాశనం చేయకుండా చూడటమే'' అని అధికారిక మీడియా ఇంటర్వ్యూలో పెజెష్కియాన్ తెలిపారు. అంతకుముందు పార్లమెంటు స్పీకర్ ఖలీబఫ్ మాట్లాడుతూ.. ఆందోళనకారులతో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. అరెస్టయిన వారిని శిక్షిస్తామన్నారు.ఇరాన్ కరెన్సీ విలువ పడిపోవడం, జీవన వ్యయాలు పెరగడం వంటి సమస్యలతో రెండు వారాలుగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించింది. మరోవైపు.. ఇరాన్ స్వేచ్ఛ కోసం ఎదురుచూస్తోందని, వారికి సాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని ట్రంప్ పోస్టు చేశారు. దీన్ని ఇరాన్ ఖండించింది. ఒకవేళ తమపై అమెరికా దాడి చేస్తే.. ఆ దేశంతోపాటు ఇజ్రాయెల్ తమ లక్ష్యాలుగా మారతాయని హెచ్చరించింది.




గ్యాస్ సమస్యకు చెక్..

కపాలభాతి ఆసనం వేయడం వల్ల పొట్ట ఎక్కువగా కదులుతుంది. ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాసల కారణంగా పొట్ట కదలడం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల కాలేయం, క్లోమం దాని చుట్టూ ఉండే కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆయా అవయవాలకు రక్తప్రసరణ మెరుగుపడుతుంది. కపాలభాతి ఆసనం వల్ల కడుపులో గ్యాస్ సమస్య తగ్గుతుంది. కడుపులో అధిక ఆమ్లత్వం కారణంగా తలెత్తే సమస్యలు కూడా తగ్గుతాయి.



కపాలభాతితో సంపూర్ణ ఆరోగ్యం..



మన దేశంలో యోగాకు చాలా ప్రాధాన్యత ఉంది. యోగా అంటే కేవలం కొన్ని భంగిమలను పునరావృతం చేయడం కాదు. జీవితంలో ఉండే సూక్ష్మశక్తులను గుర్తించడం. ప్రశాంతంగా కూర్చుని నుదుటి మధ్య దృష్టిని కేంద్రీకరించనప్పుడే మనం ఈ సూక్ష్మ శక్తులను గుర్తించగలుగుతాం. శరీరాన్ని, మనస్సును ఏకం చేయడానికి యోగాకు మించిన సాధన లేదు. నిశ్చలతను అభ్యసించినప్పుడే మనం శరీరాన్ని, మనసును ఏకం చేయగలం. నిశ్చలంగా ఉండి, శ్వాస తీసుకుంటూ, అసమతుల్యతను దూరం చేస్తూ చేసే యోగా సాధనాల్లో కపాలభాతి ఆసనం కూడా ఒకటి. మన శరీరానికి, మనసుకు గొప్ప అనుభూతిని ఇచ్చే ఆసనాల్లో ఇది ఒకటి. ఈ ఆసనం వేయడం కూడా చాలా సులభం. దీనిని యోగా ఆసనం అనడం కంటే శ్వాస వ్యాయామం అనడం మంచిది. ఈ ఆసనం వేయడం వల్ల ముఖంపై సహజ కాంతి వస్తుందని యోగా నిపుణులు చెబుతున్నారు. ఈ ఆసనం వేయడం వల్ల శారీరక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఎన్నో కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. కపాలభాతి ఆసనం వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి యోగా నిపుణులు వివరిస్తున్నారు.

గ్యాస్ సమస్యకు చెక్..

కపాలభాతి ఆసనం వేయడం వల్ల పొట్ట ఎక్కువగా కదులుతుంది. ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాసల కారణంగా పొట్ట కదలడం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల కాలేయం, క్లోమం దాని చుట్టూ ఉండే కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆయా అవయవాలకు రక్తప్రసరణ మెరుగుపడుతుంది.కపాలభాతి ఆసనం వల్ల కడుపులో గ్యాస్ సమస్య తగ్గుతుంది. కడుపులో అధిక ఆమ్లత్వం కారణంగా తలెత్తే సమస్యలు కూడా తగ్గుతాయి. జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. పొట్ట చుట్టూ అధిక కొవ్వు సమస్యతో బాధపడే వారు కపాలభాతి ఆసనం వేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ ఆసనం వేయడం వల్ల పొట్ట చుట్టూ అధికంగా ఉండే కొవ్వు వేగంగా కరుగుతుంది.

ఊపిరితిత్తుల ఆరోగ్యానికి..


కపాలభాతి ఆసనం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ఈ ఆసన సాధన వల్ల గుండె, ఊపిరితిత్తుల్లో ఉండే అడ్డంకులు తొలగించబడతాయి. దీని వల్ల శరీరంలో రక్తప్రసరణ వేగం పెరుగుతుంది. బద్ధకం తగ్గి శరీరంలో ఉత్తేజంగా ఉంటుంది. కపాలభాతి ఆసనం వల్ల ముఖం ప్రకాశవంతంగా తయారవుతుంది. ఈ ఆసనాన్ని తరచూ సాధన చేయడం వల్ల మెదడు కణాలు ఉత్తేజంగా తయారవుతాయి. ఏకాగ్రత పెరుగుతుంది. జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. మతిమరుపు వంటి సమస్యలు తగ్గుతాయి. కపాలభాతి ఆసనం వల్ల ఆధ్యాత్మిక ఫలితాలు కూడా కలుగుతాయి. ఈ ఆసనం శరీరంలోని చక్రాలను సక్రియం చేస్తుంది. ఇది శరీరానికి గొప్ప మేల్కొలుపును ఇస్తుంది.ఇలా మన మొత్తం శరీరానికి కపాలభాతి ఆసనం మేలు చేస్తుందని దీనిని తరచూ సాధన చేయడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని యోగా నిపుణులు చెబుతున్నారు. అయితే నడుము సమస్యలు, అధిక రక్తపోటు వంటి సమస్యలతో బాధపడే వారు నిపుణుల పర్యవేక్షణలో ఈ ఆసనాన్ని సాధన చేయాలి. అలాగే ఈ ఆసనాన్ని ఉదయం పూట చేయవచ్చు లేదా ఉదయం



డీఎంకేకాంగ్రెస్ పొత్తు లేనట్లేనా..?

ఈ ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ కొత్త పొత్తులు కలిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటిదాకా కలిసున్న పార్టీలు దూరమయ్యే అవకాశాలున్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి. తమిళనాడులో అధికార డీఎంకేకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే, రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పని చేసే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి.దీనికి కారణం కాంగ్రెస్ ప్రతిపాదనే అని తెలుస్తోంది. సీట్ల షేరింగ్ తోపాటు, అధికారంలో కూడా భాగస్వామ్యం కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీనికి డీఎంకే అంగీకరించలేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌డీఎంకే పొత్తు ఉండకపోవచ్చని తమిళనా-డు మంత్రి పెరియసామి తెలిపారు. అధికారాన్ని పంచుకునేందుకు తమ పార్టీ అధినేత, సీఎం స్టాలిన్ సిద్ధంగా లేరని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత మాణిక్కం ఠాగూర్ తమకు అధికారంలో వాటా కావాలని అడిగినా ఇందుకు డీఎంకే సానుకూలంగా స్పందించలేదు.పైగా తమిళనాడులో 1967 నుంచి ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఒంటరిగానే గెలిచాయని పెరియసామి అన్నారు. 2006లో డీఎంకే.. ఇతర పార్టీల మద్దతుతో అధికారం చేపట్టినప్పటికీ.. ఇతర పార్టీల నేతలకు మంత్రివర్గంలో చోటు మాత్రం కల్పించలేదు. తమిళనాడుకు సంబంధించి మద్రాస్ రాష్ట్రంగా ఉన్న సమయంలో, 1952-57 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయితే, మెజారిటీ లేని కారణంగా అప్పుడు మాత్రమే నాన్ కాంగ్రెస్ నేతలకు మంత్రి పదవులు దక్కి, ప్రభుత్వంలో భాగస్వాములయ్యారు. మిగతా ఎప్పుడూ తమిళనాడులో ఇతర పార్టీలు ప్రభుత్వంలో ఉన్నా.. మంత్రివర్గంలో చోటు మాత్రం దక్కలేదు.ఈ నేపథ్యంలో రెండు పార్టీలు కలిసి పోటీచేసినా సరే.. కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వంలో భాగస్వామ్యం ఇవ్వడానికి డీఎంకే సిద్ధంగా లేదు. మరోవైపు.. నటుడు విజయ్ స్థాపించిన టీవీకేతో కాంగ్రెస్ పార్టీ పొత్తుకు ప్రయత్నిస్తోందనే ప్రచారం జరుగుతోంది. వచ్చే మార్చిఏప్రిల్‌లో తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.

ఉద్ధవ్‌పై ఫడ్నవీస్ సెటైర్లు..



మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రేల వైరుధ్యాలు అందరికీ తెలిసిందే. ప్రస్తుతం వీరిద్దరి మధ్య సంబంధాలు ఉప్పునిప్పులా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఏక్ నాథ్ శిండే, ఉద్ధవ్ ఠాక్రేలతో ఎవరితో పనిచేయడం తేలిక అని రిపోర్టర్ ప్రశ్నించారు. దీనికి ఫడ్నవీస్ బదులిస్తూ ఉద్ధవ్‌తో పని చేయడం చాలా టఫ్ జాబ్ అన్నారు.మహారాష్ట్రలో త్వరలో బృహత్ ముంబై మున్సిఫల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. దేశ ఆర్థిక రాజధాని నగరంలో జరిగే ఎన్నికలు కావడంతో వీటిని అన్ని పార్టీలు కీలకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఓ నేషనల్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే గురించి ఫడ్నవీస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఫడ్నవీస్ మాట్లాడుతూ "శిండేతో వ్యవహారం చాలా తేలిక ఎందుకంటే ఆయన ఎమోషల్ వ్యక్తి, నేను కూడా ఎమోషనల్ వక్తినే కనుక ఇది జరుగుతుంది. భావోద్వేగంతో అర్థం చేసుకుంటే శిండేతో వ్యవహారం చాలా సులభం. అయితే ఆయన కంటే నేను ఎక్కువ ప్రాక్టికల్ వ్యక్తిని, అదే ఉద్ధవ్ ఠాక్రే విషయానికోస్తే ఆయన ఎవరికీ అర్థం కారు. ఆయనను అర్థం చేసుకోవాలంటే ఒక స్కాలర్‌ని అపాయింట్ చేసుకోవాలి. అందుకే ఆయనతో వ్యవహారం చాలా కష్టమైన పని" అని ఫడ్నవీస్ అన్నారు.ప్రస్తుతం తమ ఎన్డీయే అలయెన్స్‌లో ఎటువంటి విభేదాలు లేవని స్థిరంగా ఉందని వచ్చే ఐదేళ్లతో పాటు దాని తర్వాత కూడా కలిసే తాము కలిసే ఉంటామని ఫడ్నవీస్ అన్నారు. 2019కి ముందు శివసేన ఎన్డీఏలో భాగస్వామిగా ఉండేది. 2019లో ఎన్డీఏ నుంచి విడిపోయి కాంగ్రెస్, ఎన్సీపీలతో జతకట్టి ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి అయ్యారు.






భారత్‌లో మెరిసిన ప్రపంచకప్ ట్రోఫీ



పుష్కరకాలం తర్వాత ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీని భారత్‌లో ప్రదర్శిస్తున్నారు. మూడు రోజులు దేశంలోని ప్రధాన నగారాల్లో అభిమానుల సందర్శనార్థం ఈ ట్రోఫీని ఉంచుతారు. ఫిఫా ట్రోఫీ ఆవిష్కరణలో ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే, కేంద్ర క్రీడల మంత్రి, యువజనుల వ్యవహారాల మంత్రి మన్సూఖ్ మాండవీయ బ్రెజిల్ వరల్డ్ కప్ విజేత గిల్బెర్టో సిల్వా పాల్గొన్నారు. రెండు రోజులు ఢిల్లీలోని ప్రముఖ సెంటర్లలో ఫిఫా ట్రోఫీని ప్రదర్శనకు ఉంచుతారు. అనంతరం అస్సాంలోని గువాహటిలో వరల్డ్‌కప్ ట్రోఫీ సందడి చేయనుంది.అయితే.. భారత ఫుట్ బాల్‌ను నాశనం చేస్తున్న చౌబే.. సాకర్ కప్‌ను ఆవిష్కరించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇండియన్ సూపర్ లీగ్ ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి మన్సూఖ్ పాపులర్ జట్ల మోహున్ బగన్, ఈస్ట్ బెంగాల్ పేర్లను తప్పుగా పలకడం కూడా విమర్శలకు తావిచ్చింది. మండిపడుతున్నారు. ఈఏడాది ఫిఫా ప్రపంచకప్ పోటీలకు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. జూన్ 11వ తేదీ గురువారం ఫిఫా వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. నెల రోజులకుపైగా అభిమానులను గోల్స్ వర్షంలో ముంచెత్తనున్న ఈ టోర్నీ జూలై 19వ తేదీన ముగియనుంది. గత సీజన్‌లో విజేతగా నిలిచిన అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

ఉత్కంఠ పోరులో భారత్ జయకేతనం

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో టీమ్‌ఇండియా శుభారంభం చేసింది. వడోదర వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో గెలుపు కోసం ఇరు జట్లూ తీవ్రంగా పోరాడాయి. అయితే, ఆఖరికి విజయం భారత్‌నే వరించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో టీమ్‌ఇండియా 10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 306 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' విరాట్ కోహ్లి (93) కొద్దిలో సెంచరీని చేజార్చుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (56) హాఫ్ సెంచరీ సాధించాడు. కివీస్ బౌలర్లలో జేమీసన్ 4.. ఆదిత్య అశోక్, క్లార్క్ చెరో వికెట్ తీశారు.న్యూజిలాండ్ నిర్దేశించిన 301 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్ స్కోరు 39 ఓవర్లకు 234/2.. అప్పటికి క్రీజ్‌లో విరాట్ కోహ్లి సెంచరీకి చేరువగా ఉన్నాడు. శ్రేయస్ (49) కూడా మంచి ఫామ్ కనబరిచాడు. చివరి 66 బంతుల్లో 67 పరుగులు చేయాలి. చేతిలో ఇంకా 8 వికెట్లు. కానీ, ఇక్కడే కివీస్ బౌలర్ జేమీసన్ విజృంభించాడు. ఒకే ఓవర్‌లో విరాట్, రవీంద్ర జడేజా (4)ను ఔట్ చేసి భారత అభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేశాడు. అయితే, హర్షిత్ రాణా (29), కేఎల్ రాహుల్ (29*) దూకుడుగా ఆడి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారు. వీరిద్దరూ కీలక సమయంలో పరుగులు రాబట్టారు. హర్షిత్ రాణా ఔటైన తర్వాత వాషింగ్టన్ సుందర్ (7*)తో కలిసి కేఎల్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. బౌలింగ్ చేస్తూ గాయపడిన సుందర్ కివీస్ ఇన్నింగ్స్ 20వ ఓవర్ సమయంలోనే మైదానం వీడాడు. దీంతో బ్యాటింగ్‌కు వస్తాడా? లేదా? అనే అనుమానాలు తొలుత తలెత్తాయి. కానీ, అవసరమైన సమయంలో నొప్పితోనే సుందర్ వచ్చి ఆఖరి వరకూ క్రీజ్ లో ఉండిపోయాడు. చివరి రెండు ఓవర్లలో 12 పరుగులు అవసరం కాగా.. 49వ ఓవర్‌లోనే కేఎల్ రాహుల్ 2 ఫోర్లు, సిక్స్ బాదేసి మ్యాచ్‌ను త్వరగా ముగించాడు. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ (26) రాణించాడు. డారిల్ మిచెల్ దూకుడుతొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ భారీ స్కోరు చేయడంలో డారిల్ మిచెల్ (84)తోపాటు ఓపెనర్లు డేవన్ కాన్వే (56), హెన్రీ నికోల్స్ (62) కీలక పాత్ర పోషించారు. ఈ ముగ్గురూ హాఫ్ సెంచరీలతో రాణించారు. మిచెల్ దూకుడుగా ఆడి పరుగులు రాబట్టాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 2, సిరాజ్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, కుల్‌దీప్ యాదవ్ ఒక వికెట్ తీశాడు.



గుజరాత్ జెయింట్స్‌పై హ్యాట్రిక్ వికెట్లు


మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ నందని శర్మ(డబ్ల్యూపీఎల్‌లో నందని కంటే ముందు ఇసీ వాంగ్(ముంబై ఇండియన్స్), దీప్తి శర్మ(యూపీ వారియర్స్), గ్రేస్ హ్యారిస్(యూపీ వారియర్స్)లు హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టారు. ఆరంభ సీజన్‌లో యూపీ వారియర్స్‌పై వాంగ్ వరుసగా మూడు వికెట్లు తీసింది. కిరన్ నవ్‌గరే, సిమ్రాన్ షేక్, సోఫీ ఎకిల్‌స్టోన్‌లను ఔట్ చేసింది. హ్యాట్రిక్ నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 20వ ఓవర్లో వరుసగా మూడు వికెట్లు తీసి చరిత్రకెక్కింది. నాలుగో బంతికి కనికా ఆహుజాను వికెట్ కీపర్ లీ స్టంపౌట్ చేసింది. ఐదో బంతికి రాజేశ్వరీ గైక్వాడ్‌ను నందని బౌల్డ్ చేసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రేణుకా సింగ్‌ను బౌల్డ్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేసుకుంది. మొత్తంగా ఈ లీగ్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన నాలుగో బౌలర్‌గా నందని అవతరించింది.రెండో సీజన్‌లో దీప్తి శర్మ ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు మేగ్ లానింగ్, సథర్‌లాండ్, అరుంధతి రెడ్డిలను ఔట్ చేసి హ్యాట్రిక్ సాధించింది. యూపీ వారియర్స్ పేసర్ గ్రేస్ హ్యారిస్ సైతం ఢిల్లీపైనే ఈ రికార్డు నెలకొల్పింది. చిన్నస్వామి స్టేడియంలో నిక్కీ ప్రసాద్, చిన్నెలే హెన్రీ, మిన్ను మణిలను ఔట్ చేయడం ద్వారా హ్యాట్రిక్ నమోదు చేసింది.



హీరో ఎవరనేది పట్టించుకోను


'నా దృష్టిలో కథే హీరో. కథ ఎలా ఉంది?, దర్శకుడు ఆ కథను, అందులోని పాత్రలను ఎలా చూపించబోతున్నారు అనేది ఆలోచిస్తాను. హీరో ఎవరనేది ముఖ్యం కాదు. కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇస్తాను. ఈ పాత్ర నా కెరీర్ కి ఎలా ఉపయోగపడుతుంది అనేది మాత్రమే చూస్తాను' అన్నారు యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి. మీనాక్షి చౌదరి, నవీన్ పొలిశెట్టి జంటగా నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మీనాక్షి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలుగుంటూరు కారం, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు ఇలా వరుసగా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావడం చాలా చాలా సంతోషంగా ఉంది. గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం'తో మరిచిపోలేని సంక్రాంతి విజయాన్ని అందుకున్నాను. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు'తో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకుంటాననే నమ్మకం ఉంది. ఈ సినిమా వల్ల నటిగా నేను మరింత ఓపెన్ అయ్యాను. లక్కీ భాస్కర్ లోని సుమతి పాత్రకు ఈ చారులత పాత్ర పూర్తి భిన్నమైనది. దర్శకులు ఆ పాత్రలను మలిచిన తీరుకి తగ్గట్టుగా నన్ను నేను మలుచుకుంటాను. ఇందులో అద్భుతమైన కామెడీ టైమింగ్ చూస్తారు.గోదావరి ప్రాంతంలో చిత్రీకరణ అనుభూతి చాలా బాగుంది. అక్కడి ప్రజలు బాగా చూసుకున్నారు. ఎన్నో వంటకాలు తిన్నాను. ఆలయాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను సందర్శించాను. అక్కడి ప్రజలు సినిమా అంటే ప్రత్యేక అభిమానం చూపిస్తుంటారు. గోదావరి ప్రాంతంలో షూటింగ్ అనుభూతిని ఎప్పటికీ మరిచిపోలేను.

రుక్మిణిలో అన్నీ వెరియేషన్స్..!




సౌత్ లో ప్రస్తుతం సూపర్ ఫాంలో ఉన్న భామ రుక్మిణి వసంత్. సప్త సాగరాలు దాటి సినిమాతో సూపర్ పాపులర్ అయిన ఈ అమ్మడు ఆ తర్వాత వరుస స్టార్ ఛాన్స్ లను అందుకుంటుంది. కాంతారా చాప్టర్ 1 లో తన రోల్ తో ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసింది ఈ అమ్మడు. కాంతారా 1 తో రుక్మిణి వసంత్ సత్తా చాటగా ఆమె క్రేజ్ మరింత పాపులర్ అయ్యింది. అందుకే అమ్మడికి వరుస ఛాన్స్ లు ఇస్తున్నారు. ఐతే రుక్మిణి వసంత్ ప్రస్తుతం ఎన్ టీ ఆర్ డ్రాగన్ సినిమాలో ఛాన్స్ పట్టేసింది. ఆ సినిమాతో అమ్మడు ఒక రేంజ్ లో క్రేజ్ తెచ్చుకునే ఛాన్స్ ఉంది.రుక్మిణి వసంత్ యష్ తో టాక్సిక్ సినిమా ఛాన్స్ అందుకుంది. డ్రాగన్ లో తన లుక్ ఎలా ఉంటుందో తెలియదు కానీ యష్ టాక్సిక్ సినిమాలో రుక్మిణి వసంత్ గ్లామర్ రోల్ లో కనిపిస్తుంది. రుక్మిణి వసంత్ సప్త సాగరాలు దాటిలో ప్రేమికురాలిగా.. కాంతారా చాప్టర్ 1లో ఒక డిఫరెంట్ రోల్ చేయగా టాక్సిక్ సినిమాలో ఆమె ఇదివరకు ఎప్పుడు లేని విధంగా గ్లామర్ రోల్ తో మెస్మరైజ్ చేయనుంది. రుక్మిణి వసంత్ లో ఈ వేరియేషన్స్ ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తున్నాయి. రుక్మిణి ఇప్పటికే సౌత్ లో మంచి ఫాలోయింగ్ ఏర్పరచుకోగా రాబోతున్న ఈ సినిమాలతో మళ్లీ అదరగొట్టే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. రుక్మిణి వసంత్ ఒక ప్లానింగ్ ప్రకారంగానే కెరీర్ కొనసాగిస్తుందని చెప్పొచ్చు. తప్పకుండా అమ్మడు సౌత్ లో టాప్ ప్లేస్ కైవసం చేసుకునేలా ఉంది. మొన్నటిదాకా నేషనల్ క్రష్‌గా రష్మిక మందన్న ఉండగా ఇప్పుడు ఆ ప్లేస్ లో రుక్మిణి వసంత్ పేరు మారు మోగిపోతుంది. తెలుగులో ఇప్పటికే స్టార్ ఛాన్స్ లతో దూసుకెళ్తున్న అమ్మడు నెక్స్ట్ రాబోయే సినిమాలతో కూడా తన సత్తా చాటేలా ఉంది. ఇచ్చిన పాత్రకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ అదరగొట్టేస్తున్న అమ్మడు రాబోయే ఐదారేళ్ల కెరీర్ లో టాప్ రేంజ్ కొనసాగించేలా ఉంది. సోషల్ మీడియాలో ఎక్కువగా సెర్చ్ చేస్తున్న హీరోయిన్.. రుక్మిణితో పాటు మిగతా భామలంతా కూడా ప్రయత్నిస్తున్నా ఈమధ్య కాలంలో సోషల్ మీడియాలో ఎక్కువగా సెర్చ్ చేస్తున్న హీరోయిన్ గా రుక్మిణి అదరగొట్టేస్తుంది. తారక్ సినిమానే కాదు నెక్స్ట్ చరణ్ తో కూడా అమ్మడు జత కట్టే ఛాన్స్ లు ఉన్నాయని తెలుస్తుంది. సో క్యారెక్టర్ డిమాండ్ చేస్తే రుక్మిణి వసంత్ యాక్టింగ్ తోనే కాదు గ్లామర్ సైడ్ కూడా ఓ పెన్ అయ్యి ఇంప్రెస్ చేసేలా ఉంది. మరి రుక్మిణి ఈ వేరియేషన్స్ ఎంతమేరకు అమ్మడికి ప్లస్ అవుతాయన్నది చూడాలి.సౌత్ లో ప్రస్తుతం సూపర్ ఫాంలో ఉన్న భామ రుక్మిణి వసంత్. సప్త సాగరాలు దాటి సినిమాతో సూపర్ పాపులర్ అయిన ఈ అమ్మడు ఆ తర్వాత వరుస స్టార్ ఛాన్స్ లను అందుకుంటుంది. కాంతారా చాప్టర్ 1 లో తన రోల్ తో ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసింది ఈ అమ్మడు. కాంతారా 1 తో రుక్మిణి వసంత్ సత్తా చాటగా ఆమె క్రేజ్ మరింత పాపులర్ అయ్యింది. అందుకే అమ్మడికి వరుస ఛాన్స్ లు ఇస్తున్నారు. ఐతే రుక్మిణి వసంత్ ప్రస్తుతం ఎన్ టీ ఆర్ డ్రాగన్ సినిమాలో ఛాన్స్ పట్టేసింది. ఆ సినిమాతో అమ్మడు ఒక రేంజ్ లో క్రేజ్ తెచ్చుకునే ఛాన్స్ ఉంది.రుక్మిణి వసంత్ యష్ తో టాక్సిక్ సినిమా ఛాన్స్ అందుకుంది. డ్రాగన్ లో తన లుక్ ఎలా ఉంటుందో తెలియదు కానీ యష్ టాక్సిక్ సినిమాలో రుక్మిణి వసంత్ గ్లామర్ రోల్ లో కనిపిస్తుంది. రుక్మిణి వసంత్ సప్త సాగరాలు దాటిలో ప్రేమికురాలిగా.. కాంతారా చాప్టర్ 1లో ఒక డిఫరెంట్ రోల్ చేయగా టాక్సిక్ సినిమాలో ఆమె ఇదివరకు ఎప్పుడు లేని విధంగా గ్లామర్ రోల్ తో మెస్మరైజ్ చేయనుంది.

కొత్త సన్నివేశాలతో రాజాసాబ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన `ది రాజాసాబ్` ఎలాంటి టాక్ ను సొంతం చేసుకుందో తెలిసిందే. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన సినిమా వాటిని అందుకోవడంలో విఫలమవ్వడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కో వాల్సి వచ్చింది. సినిమాకు నెగిటివ్ రివ్యూలు..థియేటర్ల వద్ద పబ్లిక్ టాక్ తో దుమ్మెత్తి పోసారు. సినిమాపై మారుతి ఎంతో కాన్ఫిడెంట్ గా ఉంటే? అందుకు భిన్నంగా సన్నివేశం థియేటర్ వద్ద, రివ్యూల రూపంలో కనిపించింది. దీనికి సంబంధించి మారుతి ప్రెస్ మీట్ పెట్టి మరీ వివరణ వచ్చే ప్రయత్నం చేసారు. అలాగే సినిమాలో కొన్ని సన్నివేశాలు తొలగించినట్లు అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేసిన నేపథ్యంలో వాటిలో కొన్నింటిని అదనంగా కలుపుతున్నట్లు తెలిపారు. ద్వితియార్ధాన్ని కాస్త ట్రిమ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే తొలగించిన ప్రభాస్ సన్నివేశాలు యాడ్ చేసినట్లు తెలిపారు. ఆదివారం నుంచి న్యూ వెర్షన్ అందుబాటులో ఉం టుంది. ప్రత్యేకించి ప్రభాస్ ఓల్డ్ గెటప్ కు సంబంధించిన సన్నివేశాలు యాడ్ చేసారు. మరి న్యూ వెర్షన్ ఎలా ఉంటుంది? అన్నది చూడాలి. ఇప్పటికే సినిమా రిలీజ్ అయి రెండు రోజులవుతోంది.ఎంత రాబట్టినా? మరో కొత్త సినిమా పోటీగా రానంత వరకే. మరికొన్ని గంటల్లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన `మనశంకర వరప్రసాద్ గారు` రిలీజ్ అవుతుంది. అనీల్ రావిపూడి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. అనంతరం ఆ మరుసటి రోజు మాస్ రాజా రవితేజ నటించిన `భర్త మహాశయులకు విజ్ఞప్తి` రిలీజ్ అవుతుంది. కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాపైనే అంచనాలు బాగానే ఉన్నాయి.అటుపై యువ హీరో నవీన్ పొలిశెట్టి హీరోగా నటించిన అనగనగా ఒక రాజు, శర్వానంద్ నటించిన `నారీ నారీ నడుమ మురారీ` రిలీజ్ అవుతున్నాయి. తమిళ హీరో కార్తీ హీరోగా నటించిన `వా వాతయార్` తెలుగులో `అన్నగారు వస్తారు` టైటిల్ తో రిలీజ్ అవుతుంది. జనవరి 14న ఈ సినిమా థియేటర్లోకి రానుంది. ఇలా ఇన్ని సినిమాల మధ్యలో `రాజాసా బ్` పోటీ పడాల్సి ఉంటుంది. మరి వచ్చిన నెగిటివ్ టాక్ నేపథ్యంలో న్యూ వెర్షన్ ప్రేక్షకుల్ని ఎంత వరకూ ఆకట్టుకుంటుందో చూడాలి.



'భర్త మహాశయులకు విజ్ఞప్తి'..

మాస్ మహారాజా రవితేజ హీరోగా, కిశోర్ తిరుమల దర్శకత్వంలో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా రాబోతుంది. ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం సెన్సార్ లాంఛనాలను పూర్తి చేసుకుని, యూ/ఏ సర్టిఫికేట్‌ను పొందిందని చిత్ర నిర్మాతలు ఈరోజు ప్రకటించారు. ఇక తాజా అప్ డేట్ ప్రకారం, ఈ సినిమా నిడివి 2 గంటల 10 నిమిషాలు అని తెలుస్తోంది. ఈ చిత్రానికి ఈ రన్‌టైమ్ చాలా ప్లస్ కానుంది.ఇక ఈ సినిమాలో 'డింపుల్ హయతి - ఆషిక రంగనాథ్' పాత్రల మధ్య రవితేజ పాత్ర ఎలాంటి సమస్యలు ఫేస్ చేసింది అనే కోణంలో వచ్చే సీన్స్ చాలా బాగున్నాయట. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 13, 2026న రిలీజ్ కానుంది. ఈ సినిమా పై మంచి అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా సినిమాలో కామెడీ ఎలిమెంట్స్ బాగా వర్కౌట్ అయ్యాయి అని టాక్ ఉంది. మరి ఈ సినిమా ఏ రేంజ్ విజయం సాధిస్తోందో చూడాలి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200